RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 286 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 నవంబర్ 2024 గురువారం పేజీలు : 4

### నో ఎంట్రీ.. రాష్ట్రంలో సీబీఐకి ప్రవేశం లేదు..

బెంగళూరు: రాష్ట్రం కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేసులకు సంబంధించి సీబీఐ నేరుగా విచారణ జరిపే ప్రక్రియకు చెక్ పెట్టేలా తీర్మానించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 28 అంశాలు కేబినెట్ ముందు ప్రస్తావనకు రాగా రెండింటిని పెండింగ్‌లో పెట్టారు. మిగిలిన 26 అంశాలకు మంత్రివర్గం తీర్మానించింది. అందులో ప్రధానంగా క్రిమినల్ కేసులకు సంబంధించి సీబీఐ విచారణకు అంగీకరించేలా ఢిల్లీ పోలీసులు స్థాపించిన 1946 సెక్షన్ 6 ప్రకారం గెజిట్‌ను రద్దు చేస్తున్నట్లు శాసనసభ, న్యాయ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం కేంద్ర దర్యాప్తు సీబీఐ తమ అధికార పరిధిలో విచారణ జరిపేందుకు సంబంధిత రాష్ట్రాల నుంచి అనుమతులు పొందాల్సి ఉం టుంది.

# బీఆర్ఎస్‌లో 'నెం.2' రచ్చ

## సైలెంట్‌గా ఉంటున్న కేసీఆర్ - దూకుడుగా వ్యవహరిస్తున్న హరీష్ రావు

## ప్రతీ విషయంలో కేటీఆర్‌తో పోటాపోటీ




హైదరాబాద్ : పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించింది బీఆర్ఎస్ పార్టీ. ఇన్నేళ్లలో అటు ఆర్థికంగా, ఇటు రాజకీయంగా చాలా బలపడింది. కానీ, రాను రాను కేసీఆర్ గ్రాఫ్ దిగజారిపోవడం, ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడంతో 2023 ఎన్నికల్లో ఓటమిపాలైంది. అధికారంలో ఉన్న రోజుల్లోనే పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది నెంబర్ 2 పొజిషన్. కేసీఆర్ తర్వాత ఎవరు అనే చర్చ వచ్చిన సందర్భంలో, అటు కేటీఆర్, ఇటు హరీష్ రావు వర్గీయుల మధ్య కోల్డ్ వార్ నడిచింది. కొన్ని సందర్భాల్లో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు కొందరు బహిరంగంగానే కేటీఆర్ సీఎం అవుతారని ప్రకటనలు చేశారు. అయితే, హరీష్ రావు మాత్రం ఎప్పుడు ఛాన్స్ వచ్చినా వదలకుండా తన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ వస్తున్నారు. సైలెంట్‌గా క్యాడర్‌లో, జనంలో బలం పెంచుకుంటున్నారు. కానీ, అధికారం కోల్పోయిన దగ్గర నుంచి నెంబర్ 2 వార్ పీక్స్‌కు చేరిందనే అనుమానాలున్నాయి. దీనిపై గ్రామస్థాయిలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

**ఓటమి తర్వాత కీలక పరిణామాలెన్నో!..** పదేళ్లు సీఎంగా కొనసాగిన కేసీఆర్, మూడోసారి జరిగిన ఎన్నికల్లో ఓటమితో సైలెంట్ అయిపోయారు. ఆరోగ్య కారణాలతో కొన్నాళ్లు ఎవరికీ కనిపించలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొద్ది రోజులు బయటకు వచ్చారు. తర్వాత మళ్లీ మామూలే. ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారు. ఆఖరికి అసెంబ్లీలో మౌనముని అవతారం ఎత్తారు. బడ్జెట్ సమావేశాల్లో ఒక్క రోజు మాత్రమే హాజరై, అటు తిరిగి చూసింది లేదు. వరదల సమయంలో జనం అల్లాడిపోతున్నా కేసీఆర్ బయటకొచ్చింది లేదు.

సరిగ్గా ఇదే సమయాన్ని బాగా క్యాష్ చేసుకున్నారు హరీష్ రావు. పార్టీ అధినేత సైలెంట్‌గా ఉండడంతో కేటీఆర్ కంటే ముందే అన్ని విషయాల్లో రియాక్ట్ అవుతూ, ప్రతిపక్ష నేత పాత్ర పోషించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**వరదల సమయంలో ఫీల్డ్ విజిట్.. కౌశిక్ వ్యవహారంలోనూ అంతే!...** ఈమధ్య కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వ చర్యలను తప్పుబడుతూ కేటీఆర్ కన్నా హరీష్ రావు దూకుడుగా వ్యవహరించారు. పార్టీ నేతలను వెంటబెట్టుకుని ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారు. బాధితులను పరామర్శించారు. తానున్నాననే భరోసాను కల్పించే ప్రయత్నం చేశారు. అంతేకాదు, నిత్యావసర సరుకులను సిద్దిపేట నుంచి లారీలలో తరలించారు. ఆ సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల నేతలతో నిత్యం టచ్‌లో ఉంటూ ముందుకు సాగారు. ఇక్కడే కేటీఆర్ కన్నా హరీష్ రావుకు ఎక్కువ మార్కులు పడ్డాయి. తర్వాత పాడి కౌశిక్ రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారం తెరపైకి వచ్చింది. కౌశిక్ రెడ్డి వెనుక ఉండి అంతా నడిపించారు హరీష్ రావు. ఎమ్మెల్యేతో కలిసి ధర్నా కూడా చేశారు. క్యాడర్‌లో జోష్ నింపేందుకు ప్రయత్నించారు.

**మూసీ ఇష్యూలోనూ ఇద్దరి మధ్య పోటీ...** బీఆర్ఎస్ హయాంలో ఎంతో ఆర్భాటంగా మూసీ ప్రక్షాళన ప్రకటించారు కేసీఆర్. కానీ, జరిగింది ఏం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే ప్రాజెక్టును చేపట్టి, పనులు వేగంగా జరిగేలా రేవంత్ సర్కార్ వ్యవహరిస్తోంది. నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తోంది. అయితే, దీని చుట్టూ కూడా హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ అనేలా కోల్డ్ వార్ కొనసాగుతోంది. నిర్వాసితుల పలకరింపులోనూ ఇద్దరు నేతలు పోటీపడి మరీ వెళ్లారు. ఎప్పటిలాగా ముందుగానే రియాక్ట్ అయిన హరీష్ రావు, బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. అయితే, కేటీఆర్ తానేమన్నా తక్కువా అన్నట్టు ఒకటికి రెండు సార్లు పర్యటనలు చేసి హీట్ పెంచారు. ఇలా ఒకటా రెండా, చాలా విషయాల్లో హరీష్ రావు, కేటీఆర్ మధ్య సైలెంట్ వార్ నడుస్తోంది. మొన్న మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి బాధ్యతలు చేపట్టిన సందర్భంలో కేటీఆర్, హరీష్ వెళ్లారు. కానీ, కలిసి కనిపించింది లేదు. వేర్వేరుగా వెళ్లి బొకేలు ఇచ్చి వచ్చేశారు. ఇవన్నీ గమనిస్తున్న కిందిస్థాయి క్యాడర్ కన్ఫ్యూజన్‌లో పడిపోయింది.

**గతంలో గప్‌చుప్.. కేసు భయమేనా?...** బీఆర్ఎస్ రెండోసారి గెలిచి అధికారం చేపట్టాక హరీష్ రావును దూరం పెట్టారు కేసీఆర్. దీనిపై అనేక చర్చలు జరిగాయి. నెంబర్ 2 పొజిషన్ కేటీఆర్‌కు ఫిక్స్ చేయాలనే లక్ష్యంతోనే హరీష్‌కు కేసీఆర్ పదవి ఇవ్వలేదని అంతా అనుకున్నారు. అయితే, తమ నాయకుడికి పదవి రాలేదని అనుచరులు కాస్త ఓవర్‌గా రియాక్ట్ అయ్యారు. ఇదంతా హరీష్ కనుసన్నల్లోనే జరుగుతోందన్న కబురు కేసీఆర్‌కు చేరింది. అంతకుముందు పాస్ పోర్టు కేసులో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని అరెస్ట్ చేశారు. దీనిని బూచిగా చూపిస్తూ హరీష్ రావును కూడా బెదిరించారనే ప్రచారం సాగింది. గతంలో హరీష్ రావు భార్య, కూతురు పేర్ల మీద దొంగ పాస్ పోర్టులతో గుజరాత్ మహిళలను అమెరికా పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఇప్పుడు బీఆర్ఎస్ అధికారంలో లేదు. కేసీఆర్ అంత యాక్టివ్‌గా లేరు. ఈ నేపథ్యంలో హరీష్ రావు దూకుడుగా వ్యవహరిస్తున్నట్టు గ్రామస్థాయిలో చర్చ జరుగుతోంది.

దీంతో ఎప్పుడేం జరుగుతుందో అనే టెన్షన్ వారి మాటల్లో వినిపిస్తోంది. త్వరలోనే కేసీఆర్ బయటకు వస్తారని అంటున్నారు. మరి, ఆయనొస్తే ఏమైనా మార్పు ఉంటుందేమో అనే ఆశలో ఉన్నారు. అయితే, అప్పుడు కేసీఆర్ పవర్‌లో ఉన్నారని సైలెంట్ అయిన హరీష్ రావు, ఇప్పుడు చెప్పిన మాట వినకపోవచ్చు కానీ, పాత కేసు సీబీసీఐడీ చేతిలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెడితే పరిస్థితి ఏంటనే చర్చ కూడా జరుగుతోంది.




## హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం.. ఎక్కడంటే..?

హైదరాబాద్ : 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పార్టీ భారీ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ విజయం ఉత్సాహంతో తెలంగాణలోను టీడీపీ పార్టీకి పునర్ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్ పట్టణంలో టీడీపీని స్థాపించిన మాజీ సీఎం ఎన్టీఆర్‌విగ్రహం ఏర్పాటు చేస్తామని.. టీడీ జనార్ధన్ చెప్పుకొచ్చారు. గతంలో టీడీపీని స్థాపించిన చోటే వంద అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆయన చెప్పుకొచ్చారు. తెలుగు వారు అందరూ ఏకం కావాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించారు. టీడీపీ పార్టీకి చెందిన కార్యకర్తలు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు.

ఎన్టీఆర్ చేసిన సేవలకు ప్రపంచ దేశాల నుంచి ఇప్పటికే మంచి గుర్తింపు వచ్చింది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్ నగరంలో అన్నగారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలుగు ప్రజలకు అంకితమిస్తామని ఈ సందర్భంగా వారు చెప్పుకొచ్చారు.




## తెలంగాణలో మందుబాబులకు షాక్..లిక్కర్ సరఫరా ఆగిపోయింది

హైదరాబాద్ : తెలంగాణలో మందుబాబులకు షాక్ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా వైన్ షాపులకు లిక్కర్ సరఫరా ఆగిపోయింది. దీనికి కారణం సాంకేతిక సమస్యలేనని ఎక్సైజ్ శాఖ తెలిపింది.

ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం సరఫరా పూర్తిగా ఆన్లైన్ పద్ధతిలో జరుగుతున్నది. ఈ నేపథ్యంలో సర్వర్ సమస్య తలెత్తడంతో ఐఎంఎఫ్ఎల్ డిపోల నుంచి డీలర్లు మద్యం తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రాత్రిలోపు సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.





# తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే షురూ..!

## సర్వేలో సేకరిస్తున్న వివరాలు ఇవే..!!

తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఇవాల్టి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వే చేస్తున్నారు.. ఇప్పటికే కుటుంబాలను గుర్తించి ఇంటికి స్టిక్కర్లు అతికించారు. ఇంటింటి సర్వేలో 56 ప్రధానమైన ప్రశ్నలు ఉన్నాయి. 19 అనుబంధ ప్రశ్నలతో మొత్తం 75 ప్రశ్నలతో కూడిన వివరాలను సేకరించనున్నారు. ఇంటింటి సర్వేకోసం సుమారు 85వేల ఎన్యుమరేటర్లు సిద్ధం కాగా.. ఇందులో దాదాపు 40వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పదిమంది ఎన్యుమరేటర్లకు ఒకరి చొప్పున 8వేల 500 మంది పర్యవేక్షకులను నియమించారు. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 83లక్షల కుటుంబాలు ఉండగా.. ప్రస్తుత సర్వేలో ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు సర్వేపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎన్యుమరేటర్లకు ప్రశ్నావళితోపాటు ఫ్యాడ్, పెన్ను, పెన్సిల్ అందించారు. కుటుంబ సభ్యుల పేర్లతోపాటు అందరి మొబైల్ నెంబర్లు సేకరిస్తారు. సమగ్ర కుటుంబ సర్వేలో కులం, మతం, సామాజిక అంశాలపై వివరాలు సేకరించనున్నారు.

కుటుంబ సభ్యుల వారీగా విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, వార్షిక ఆదాయ వివరాలు సేకరించనున్నారు. కుటుంబానికి ఉన్న భూములు, ఇళ్లు, ఇతర స్థిర, చరాస్తుల వివరాలు సేకరిస్తారు. ఇప్పటి వరకు విద్య, ఉద్యోగాల్లో పొందిన రిజర్వేషన్ ప్రయోజనాల వివరాలు.. గత ఐదేళ్లుగా పొందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, తీసుకున్న రుణాలు, గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజాప్రతినిధులుగా, నామినేటెట్ పదవులపై వివరాలు సేకరించనున్నారు. అదేవిధంగా.. కుటుంబ సభ్యులు విదేశాలు లేదా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారా అనే అంశాలపైనా సర్వేలో ఎన్యుమరేటర్లు వివరాలు సేకరించనున్నారు. సొంత ఇళ్లు - అద్దె ఇళ్లు వివరాలు, ఇంట్లో ఫ్రిజ్, కారు, ద్విచక్రవాహనం, కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ వివరాలు సేకరించనున్నారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరు వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# సంపాదకీయం

## ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు.. ఇరకాటంలో పార్టీలు..!

ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారారు ప్రశాంత్ కిషోర్. కీలక సమయాల్లో కీలక పార్టీల గెలుపు కోసం వ్యూహకర్తగా పనిచేసిన ఆయన.. తానే స్వయంగా పార్టీని స్థాపించారు. జన్ సురాజ్ పేరుతో పార్టీని ప్రకటించి బిహార్ ఎన్నికల బరిలో నిలిచారు. ఇప్పుడు ఆయనే ఇతర పార్టీలకు సవాల్ విసురుతున్నారు. ప్రశాంత్ కిషోర్ 2014లో సార్వత్రిక ఎన్నికలతో ఆయన పేరు వెలుగులోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడంతో పీకే పేరుకు పబ్లిసిటీ వచ్చింది. ఆ పార్టీకి ఆ సమయంలో వ్యూహకర్తగా వ్యవహరించారు. మోడీ విజయంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం 2015 బిహార్ ఎన్నికల్లో జేడీయూ-ఆర్జేడీల మహాఘట్ బంధన్‌కు ప్రశాంత్ కిషోర్ వ్యూహకర్తగా పనిచేశారు. ఇక.. 2017లో పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆయన వ్యూహాలతోనే అక్కడ కాంగ్రెస్ గెలుపొందింది. అలాగే.. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేశారు. వైఎస్సార్సీపీకి సలహాదారుగా వ్యవహరించారు. దాంతో ఆ ఎన్నికల్లో జగన్ పార్టీ ఘన విజయం సాధించింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. 2020లో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయానికీ పీకేనే కారణం అయ్యారు. ఇక 2021లో తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ కోసం పీకే కీలకంగా పనిచేశారు. అయితే.. 2023 నుంచి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఐ-ప్యాక్ నుంచి తప్పుకున్నారు. ఎన్నికల వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకుని సొంతంగా పార్టీని స్థాపించారు. జన సూరజ్ పేరుతో పార్టీని పెట్టి బిహార్‌లో పాదయాత్ర సైతం చేపట్టారు. అయితే.. ఇటీవలే దానిని రాజకీయ పార్టీగానూ మార్చారు. కామన్ సివిల్ కోడ్ అంశంపైనా ఆయన స్పందించారు. ప్రజాభిప్రాయం లేకుండా ఏకాభిప్రాయంతో ముందుకు పోవడం సరికాదన్నారు. అయితే.. ఇటీవల ప్రశాంత్ కిషోర్ మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. పీకే ఎన్నికల స్ట్రాటజిస్ట్‌గా పనిచేస్తే ఆయన ఎంత చార్జ్ చేస్తారో ఇంతవరకూ ఎవరికీ తెలియదు. పనిచేయించుకున్న పార్టీకి, ఆయనకు తప్పితే బహిరంగంగా ఏనాడూ ఎక్కడా చెప్పలేదు. కానీ.. బిహార్‌లోని బెలాగంజ్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో.. ఎన్నికల వ్యూహకర్తగా ఆయన వసూలు చేసే ఫీజుపై కీలక కామెంట్స్ చేశారు. రాజకీయ పార్టీలకు సలహాదారుగా పనిచేసి.. తాను అందించిన సేవలకు తీసుకునే ఫీజును చెప్పకనే చెప్పారు. తాను ఏదైనా పార్టీకి వ్యహకర్తగా పనిచేస్తే అందుకు ఫీజు కింద రూ.100 కోట్లు తీసుకుంటానని పీకే చెప్పారు. కొన్ని కొన్ని సందర్భాల్లో అంతకుమించి కూడా తీసుకుంటానని అన్నారు. వివిధ రాష్ట్రాల్లోని పది ప్రభుత్వాలు తన వ్యూహాలతోనే నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఒక ఎన్నికల కోసం తాను వ్యూహకర్తగా పనిచేస్తే రెండేళ్ల పాటు తన పార్టీని నడుపుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే.. ఎట్టకేలకు పీకే తన ఫీజుపై చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు మరో చర్చ రచ్చ జరుగుతోంది. ఒక్కో పార్టీకి సలహాదారుగా పనిచేస్తే రూ.100 కోట్లు తీసుకుంటానని చెప్పిన పీకే.. మరి అందులో నుంచి చెల్లించాల్సిన పన్ను చెల్లించారా అన్న చర్చ నడుస్తోంది. రూ.100 కోట్ల నుంచి సుమారుగా రూ.40 కోట్ల వరకు ఆయన టాక్స్ కట్టాల్సి ఉంటుంది. మరి.. ఇన్ని పార్టీలకు ఇన్ని వందల కోట్లు వసూలు చేసిన ఆయన కేంద్రానికి ఏ మేరకు పన్నులు చెల్లించారని పలు పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. వంద కోట్ల రూపాయలకు సంబంధించి ఆయన భారత ప్రభుత్వానికి లెక్కలు చెప్పారా..? అని నిలదీస్తున్నాయి. వసూలు చేసిన వంద కోట్ల నుంచి రూ.40 కోట్లు టాక్స్ పే చేశారా..? లేదా..? అని ప్రశ్నిస్తున్నాయి. ఇదే అంశాన్ని బిహార్‌లో ఇతర పార్టీలు అస్త్రంగా మలచుకోబోతున్నాయి. అటు.. పీకే వ్యాఖ్యలతో పార్టీలు కూడా ఇరకాటంలో పడ్డాయి. ఒక్కో స్ట్రాటజీకి ఆయన రూ. 100 కోట్లు తీసుకుంటా అని చెప్పారు. దాంతో ఇప్పటివరకు ఆయనతో పనిచేయించుకున్న పార్టీలు ఆ రూ.100 కోట్లను ఎన్నికల ఖర్చులో చూపాయా..? అసలు ఆ రూ.100 కోట్లను ఎలా సమకూర్చారు..? పార్టీలు ఎక్కడి తెచ్చి పీకేకు ఇచ్చాయి..? వీటి గురించి సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఇప్పుడు పార్టీలపై ఎంతైనా ఉంది. అటు పీకే కూడా టాక్స్ చెల్లింపుపైనా వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని నెట్టింట చర్చ నడుస్తోంది.

## ఇంటింటి సర్వేలో ఎన్యూమరేటర్ల పనితీరును పరిశీలించిన కలెక్టర్ : కలెక్టర్ గౌతమ్





శామీర్ పేట, (గరుడ వార్త) : సమగ్ర ఇంటింటి సర్వే పూర్తయ్యేనాటికి కుటుంబాల సంఖ్య కచ్చితంగా రావాలంటే సంబంధిత అధికారులకు అన్యుమరేటర్లకు జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. బుధవారం శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయి పల్లిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమనేటర్ల పనితీరును జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూసామాజిక, ఆర్థికనా, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఎలాంటి దోషాలు లేకుండా నిర్వహించాలని తెలిపారు. ఇతర జిల్లాలలో నివాసముంటున్న ఒకే చోట వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ తో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఉన్నారు. అలాగే హకిం పేటలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు ఇంటింటి సర్వే ను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఎన్యూమరేటర్లకు సహకరించాలని కోరారు. తూముకుంట లో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ లు మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తో కలిసి ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మొత్తం తూంకుంట మున్సిపల్ పరిధిలోని 16 వార్డుల్లోని 66 బ్లాకులలో ఈ సర్వే ప్రారంబించడం జరిగినదని తెలిపారు. దాదాపు 9191 పై చిలుకు కుటుంబాలు ఉన్నట్టు అంచనా ఉందని, స్థానిక పరిస్తితుల దృశ్యా ఇట్టి సంఖ్య పెరగొచ్చునని చెప్పారు. ఇట్టి సర్వే లో మొదటి విడత అనగా హౌస్ లిస్టింగ్ (కుటుంబాల నమోదు) చేయడం ఈనెల 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు. 9వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మొదలు కానుందని తెలిపినారు. అలాగే ఉద్దమర్రిలో ఇంకేంటి సర్వేను ప్రారంభించారు. మాజీ సర్పంచులు వెంకటేష్, బాల నరసింహులు ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎనీవేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతుల కొరకు అలియాబాద్ లో సొసైటీ ఎరువుల షాప్ ...



శామీర్ పేట (గరుడ వార్త) : శామిర్ పేట్ సోసైటీ ఆధ్వర్యంలో ఆలియబాద్ గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండేందుకు గాను సోసైటీ ఫర్టిలేజర్ దుకాణాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు..

బుధవారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదిర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్, డిసిఎంసి వైస్ ఛైర్మన్ రామిడి మాదుకర్ రెడ్డి, తుంకుట మున్సిపల్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, ఆలియబాద్ గ్రామ మాజీ సర్పంచులు కంఠం కృష్ణారెడ్డి, ఎల్లయ్య యాదవ్, గౌరి కుమారివెంకటెష్, నాయకులు ముద్దం సుదకర్ రెడ్డి, ముద్దం సంజీవరెడ్డి, సోసైటీ డైరెక్టర్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేరుకే కమిటీలు.. పరిష్కారం కాని సమస్యలు



హుజూరాబాద్: పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.

401 వార్డులు.. 1844 కమిటీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో.. యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.

సమావేశాల ఊసే లేదు..ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి.. ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకోసారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.

ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా?

ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలామందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## రికార్డుల్లో నిషేధిత భూములు.. ధరణిలో ప్రైవేటు పట్టాలు

హైదరాబాద్: రాజధాని నగరం శివారు ప్రాంతాల భవిష్యత్తును ఊహించిన కొందరు వ్యక్తులు గండిపేట చెరువు సమీపంలో ప్రభుత్వ భూములను ఒక పథకం ప్రకారం ఆక్రమించేందుకు పాతికేళ్ల కిందటే ప్రణాళిక రచించారు. వట్టినాగులపల్లిలో సర్వే నం. 110 నుంచి 150 మధ్య వందల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు ఇచ్చినట్టు తెలుసుకున్నారు. అసైనీలకు ఇచ్చిన ప్రైవేటు పట్టాలు.. ఖాళీ ప్రభుత్వ భూముల పక్కనున్న 80 ఎకరాలను ఆక్రమించేందుకు కార్యాచరణ రూపొందించారు. కొందరు అసైనీల నుంచి, ప్రైవేటు పట్టాదారుల నుంచి భూములు కొని పక్కన ప్రభుత్వ స్థలాలకు మార్కింగ్ వేసుకున్నారు. వట్టినాగులపల్లి, గోపన్‌పల్లి, ఆర్థిక జిల్లాల పరిసర ప్రాంతాల్లో బహుళజాతి ఐటీ సంస్థలు వచ్చినా.. అనూహ్యంగా అభివృద్ధి చెందినా తొందరపడలేదు. ఐదేళ్ల కిందట ధరణి పోర్టల్ అందుబాటులోకి రాగానే.. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు, వారి కుటుంబ సభ్యుల పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి ప్రైవేటు పట్టాలుగా మార్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెలుగులోకి రాగా, రికార్డుల మార్పిడిపై అంతర్గతంగా విచారణ చేస్తున్నారు. ఈ భూముల విలువ రూ.2500 కోట్లుంటుందని అంచనావేస్తున్నారు.

## కాలయాపన.. తప్పని వేదన

పరిగి: ప్రజలకు ఉన్నత సేవలతో చేరువ కావాల్సిన రెవెన్యూ వ్యవస్థ రోజురోజుకూ సమస్యలకు నిలయంగా మారుతోంది. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పాస్ పుస్తకాలు, ఇతర పత్రాల మంజూరులో తీవ్ర కాలయాపన జరుగుతోంది. పలుచోట్ల పైసలిస్తే గానీ ఫైలు కదలని పరిస్థితి నెలకొందని అర్జీదారులు వాపోతున్నారు.

ఆదాయానికి లోటు లేదు: జిల్లాలో ఒక్కో మండలంలో రోజుకు 6 నుంచి 8 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రోజు వారీగా దాదాపు రూ.8 నుంచి రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద ఛార్జీల కింద రూ.20వేల వరకు రైతులు చెల్లిస్తున్నారు. సేవల విషయంలో మాత్రం వేగం కానరావడంలేదు.

పరిగి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం 13 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించినవే ఉంటున్నాయి. కొన్నిసార్లు అధికారులు అందుబాటులో ఉండక పోవడం ఇబ్బంది కలిగిస్తోంది. వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో భూముల క్రయ విక్రయాలకు సంబంధించి 12 రిజిస్ట్రేషన్లు జరిగాయి. మొత్తం 15 మంది ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నమోదు



చేసుకున్నారు. వివిధ కారణాలతో ముగ్గురు రిజిస్ట్రేషన్లు చేయించుకోలేదు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది.

కొత్త పథకం వస్తున్నందుకే జాప్యం

ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'భూమాత' పథకాన్ని త్వరలో ప్రవేశ పెట్టనుంది. ఈ కారణంగా రెండు మాసాలుగా ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న భూముల కొనుగోలుదారులకు కొత్త పాసుపుస్తకాల జారీని నిలిపి వేశారు.

తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వికారాబాద్.

నెలల తరబడి తిరుగుతున్నా..

మా గ్రామం తాండూరు మండలం మల్లాపూర్. మృతి చెందిన నా కుమారుడి పేరిట ఉన్న పీఎఫ్ సొమ్ము పొందాలంటే కుటుంబ సభ్యుల ధ్రువపత్రం సమర్పించాలన్నారు. గత మే 20న దరఖాస్తు చేశా. నాలుగు నెలలు గడిచినా జారీ చేయలేదు. సిబ్బందిని ఆరా తీస్తే దరఖాస్తు పత్రాలు కన్పించడంలేదనీ, నకలు ప్రతులు తీసుకురావాలన్నారు.

మాలతుల్జప్ప, మల్లాపూర్

మరోమారు చలానా కూడా కట్టా

కొడంగల్ మున్సిపల్ పరిధిలో 22 గుంతల భూమి గతంలో కొనుగోలు చేశా. మూడు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పాస్ పుస్తకం కోసం తిరుగుతున్నా. ఇటీవల మరో మారు రూ.300 చలానా కట్టమని చెబితే కట్టాను. పుస్తకం ఎప్పుడిస్తారో తెలియడంలేదు.

ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదనీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందరికీ అందుతాయని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

అచ్చుగట్ల శ్రీకాంత్, కొడంగల్ జిల్లాలో మండలాలు- 20 పంచాయతీలు- 566రోజుకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు - 140 -160 ఎక్కువగా పాస్ పుస్తకాల మంజూరు, అనువంశికం. ఆస్తి పంపకాలు తనఖా పెట్టడం దానపత్రాలు ఆస్తి మార్పిడి

## ప్రసాదం పసందేనా?

హైదరాబాద్ : ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై ఇచ్చే బోగ్(బ్లిస్‌ఫుల్ హైజెనిక్ ఆఫరింగ్ టు గాడ్) పత్రాల జారీని జీహెచ్ఎంసీ నిలిపివేసింది. ఏడాది క్రితం ఫిబ్రవరిలో 10 ఆలయాలకు ఫుడ్ లైసెన్సులు, 8 దేవాలయాలకు బోగ్ పత్రాలు జారీ చేయగా ఇతర దేవాలయాలను పరిశీలించకపోవడం గమనార్హం. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశం తెరపైకి రావడంతో నగరంలోని ఆలయాల్లో ప్రసాదాల పంపిణీపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షించడం ఇలా..తొలిదశలో భక్తులు అధికంగా వచ్చే దేవాలయాలను గుర్తించాలి. నీటి, సరకుల నాణ్యత, స్టోరేజీ, వంటగదిలో పరిశుభ్రతపై సూచనలివ్వాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి రిజిస్టర్ అయిన సంస్థల ద్వారా ప్రసాదం తయారు చేసే ఆలయ సిబ్బందికి ఫ్రాస్టాక్ శిక్షణ అందించాలి. అనంతరం ఫుడ్ లైసెన్సులు జారీ చేసి, రిపోర్టుల ఆధారంగా భోగ్ పత్రాలు జారీ చేయాలి. గ్రేటర్‌లో 1500కుపైగా ఆలయాలున్నాయి. రద్దీ అధికంగా ఉండేవి 100 వరకు ఉండగా కేవలం 8 ఆలయాల్లో బోగ్ పత్రాలు జారీ అయ్యాయి.

ఫుడ్ లైసెన్సులు జారీ అయిన దేవాలయాలివే..

మహాకాళి దేవస్థానం - సికింద్రాబాద్, ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం - బల్కంపేట, హనుమాన్ దేవస్థానం - కర్మన్‌ఘాట్, వీర హనుమాన్ దేవస్థానం - ఎస్పీరోడ్డు, హనుమాన్ దేవస్థానం - సనత్‌నగర్, పెద్దమ్మ దేవాలయం - జూబ్లీహిల్స్, హనుమాన్ దేవాలయం - వివేక్‌నగర్, లక్ష్మీగణపతి దేవస్థానం - ఆర్టీసీ క్రాస్‌రోడ్, శ్రీసాయిబాబ సమాజం - మినిస్టర్‌రోడ్డు, శ్రీగణేష్ దేవాలయం - సికింద్రాబాద్.

విజయ డెయిరీ నుంచే నెయ్యి సేకరించాలి

ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం హెచ్చరించింది. విజయడైరీ నుంచే నెయ్యిని సేకరించాలని.. మధ్యవర్తులుంటే తొలగించాలని ఉన్నతాధికారులు ఈవోలకు సూచించారు. బల్కంపేట్ దేవాలయానికి ఆది, మంగళవారాల్లో 50వేల మంది, శుక్రవారం 20వేల మంది భక్తులు వస్తుంటారు. ఆయా రోజుల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల పులిహోర, క్వింటా లడ్డూలు విక్రయిస్తారు. వంటశాలలో 8 మంది పనిచేస్తుండగా ఇద్దరిని ఫాస్ట్రాక్ శిక్షణకు పంపించారు. లడ్డూ ప్రసాదం కోసం ఏటా 10వేల లీటర్ల నెయ్యిని వాడుతామని ఆలయ అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని మంగళ, శుక్రవారాల్లో 5-6 వేల మంది భక్తులు సందర్శిస్తుంటారు. రోజూ 15-70 కిలోల పులిహోర, 500 లడ్డూల విక్రయాలు సాగుతాయి. ఇక్కడ కిలో లడ్డూ తయారీకి 750 మిల్లీలీటర్ల నెయ్యిని వినియోగిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

సికింద్రాబాద్‌లోని గణేష్ దేవాలయంలో శుక్రవారం, సెలవు రోజుల్లో 1500 నుంచి 2వేల మంది వస్తుంటారు. రోజూ 500 లడ్డూలు, 500 పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# దస్త్రం బూచి.. భూమికి పేచీ

హైదరాబాద్: హైటెక్‌సిటీలోని ఖాజాగూడలోని భూ వివాదం ముదురుతోంది. అది ప్రైవేటు భూమి అని, సీసీఎల్‌ఏ, జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా అనుమతులిచ్చామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. పాత కాలం దస్త్రాలను మార్చేసి ప్రభుత్వ భూమి ప్రైవేటుగా పేర్కొన్నారని, బహిరంగ మార్కెట్లో రూ.2 వేల కోట్ల విలువైన భూమిని స్థిరాస్తి వ్యాపారానికి మళ్లించారని స్థానికులు ఆందోళన చేపట్టారు. దీంతో 2024 అక్టోబరు 24న జారీ చేసిన నిర్మాణ అనుమతిని నిలిపివేసినట్లు బల్దియా స్పష్టం చేసింది. ఈ భూములు తమవేనంటూ ఆరుగురు వ్యక్తులు కోర్టుల్లో పిటిషన్లు వేసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో ఆరేళ్ల క్రితం శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ విచారణ చేసి అది ప్రభుత్వ భూమేనని అప్పటి కలెక్టర్‌కు నివేదించారు. కథ అక్కడ ముగిసిపోగా... మూడేళ్ల క్రితం మళ్లీ కొందరు ప్రైవేటు వ్యక్తులు పత్రాలు సృష్టించడంతో రెవెన్యూ అధికారులు వాటిని సక్రమంగా పరిశీలించకుండా నిరభ్యంతర పత్రం జారీ చేశారు. భూమి సొంతమయిందంటూ ఆరుగురు ఓ రియల్ సంస్థ ప్రతినిధులకు జీపీఏ ఇచ్చారు. దీంతో నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలంటూ జీహెచ్



ఎంసీని అభ్యర్థించగా ప్రాథమికంగా ప్లాన్‌ను మంజూరు చేశారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో కొందరు జీహెచ్‌ఎంసీ అధికారులకు అది ప్రభుత్వ భూమేనని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ ప్లాన్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసింది.

**స్థల వివాదం ఇలా..**

‘ఖాజాగూడలోని సర్వే నెం.27/2లో 27 ఎకరాల 18 గుంటల విస్తీర్ణంలో పోరంబోకు భూమి ఉన్నట్టుగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం పాత రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద కూడా ప్రభుత్వ భూమిగా నమోదైంది. యూఎల్‌సీ రికార్డుల్లో సదరు సర్వే నంబరు వివరాలు లేవు. అయితే ధరణి వెబ్‌సైట్‌లోని నిషేధిత భూముల జాబితాలో ఆ సర్వే నంబరు లేదు. అంతమాత్రాన పాతకాలం దస్త్రాలను కొట్టిపారేయలేం.. గతంలో ఒక సొసైటీ కూడా వివాదాస్పద భూమిని తమదిగా పేర్కొంటూ ఫిర్యాదు చేసింది. వీటన్నింటికన్నా ముందు తేదీలతో పాత సర్వే నంబర్లతో ప్రైవేటు భూమిగా తెలిపే దస్త్రాలున్నాయి. అందులో పది మంది యజమానులు ఉన్నారు. వారి నుంచి మరొకరు యాజమాన్య హక్కులు పొందారు. ఆయా పత్రాల ఆధారంగా.. సీసీఎల్‌ఏ, రంగారెడ్డి జిల్లా పాత కలెక్టర్ 27/2 సర్వే నంబరులోని భూమి ప్రైవేటుదిగా పేర్కొంటూ ఎన్వోసీ ఇచ్చారు. భూమిలో రోడ్డు విషయమై వివాదముంది.రెవెన్యూ అధికారులు ఇచ్చిన పత్రాలను ప్రామాణికంగా తీసుకుని 27,875.33 చ.మి విస్తీర్ణంలో 7 సెల్లార్లు, 29 అంతస్తుల భవనానికి తాత్కాలిక అనుమతి ఇచ్చాం. నిర్మాణ అనుమతికి సంబంధించి రూ.54 కోట్ల ఇంపాక్ట్ ఫీజును చెల్లించాలని లేఖ ఇచ్చాం. అంతలోనే మరో ఫిర్యాదు వచ్చింది. వెంటనే ప్రక్రియను నిలుపుదల చేశాం’ అని జీహెచ్‌ఎంసీ ప్రణాళిక విభాగం అధికారి ఒకరు తెలిపారు.

# గేటు పడితే గండమే!

పెద్దపల్లి : పెద్దపల్లి-కాల్వశ్రీరాంపూర్ మార్గంలోని రైల్వే గేటును 15 నిమిషాలకోసారి మూసివేస్తుండగా ప్రతిసారీ 20 నిమిషాల పాటు వాహనదారులు నిరీక్షించాల్సి వస్తోంది. వైద్యం అత్యవసరమైన వారిని ఆసుపత్రికి తరలించే క్రమంలో ప్రాణాలు పోతున్నాయి. దాదాపు ఏడేళ్ల కిందట ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) మంజూరు కాగా గతేడాదే పనులు మొదలయ్యాయి. మంథని, భూపాలపల్లి, జమ్మికుంట, వరంగల్ తదితర ప్రాంతాలను కలిపే ఈ మార్గంలో పై వంతన నిర్మాణం వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆర్‌యూపీల(రైల్వే అండర్‌పాస్)లు రహదారులకు దిగువన ఉండటంతో వరద నిలుస్తోంది. నీరు బయటకు వెళ్లేందుకు రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. తక్కువ ఎత్తులో నిర్మించడంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు.కరీంనగర్ నుంచి జగిత్యాల, నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై తుర్కాసిపల్లి, నమిలికొండ, పూడూరు, నూకపల్లి, పోతారం, అంతార్గం వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆర్వోబీల నిర్మాణాలకు ఇప్పటివరకు ప్రతిపాదనలు పంపలేదు. సాంకేతిక కారణాలతో రైలు పట్టాలపై నిలిచిపోతే ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిందే.

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల రైల్వే గేట్లు లేకపోవడంతో ప్రయాణ అవరోధంగా మారింది. కాజీపేట-బల్హార్షా మార్గంలో అన్ని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీ(రైల్వే పై వంతెన) లేదా ఆర్‌యూబీ(రైల్వే దిగువ వంతెన)ల నిర్మాణానికి ఎనిమిదేళ్ల కిందటే రైల్వే శాఖ అనుమతులు ఇచ్చింది. జమ్మికుంట, ఓదెల, కొలనూరు, పొత్కపల్లి, తారకరామనగర్, పెద్దపల్లిలోని కూనారం రోడ్డు, గౌరెడ్డిపేట రోడ్డు, అందుగుపల్లి, పెద్దంపేటల వద్ద ఆర్వోబీలు, కొత్తపల్లి, చీకురాయి, హరిపురం, కన్నాల వద్ద అండర్‌పాస్‌లను మంజూరు చేసింది. ఒక్క పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో మాత్రమే ఏడాది క్రితం ఆర్వోబీ పనులు మొదలయ్యాయి. చీకురాయి మినహా మిగిలిన ప్రాంతాల్లో అండర్‌పాసులు నిర్మాణ దశల్లో ఉన్నాయి. నిజామాబాద్ మార్గంలో కరీంనగర్‌లో మినహా మరెక్కడా ఆర్వోబీ లేదా ఆర్‌యూపీలు మంజూరు కాలేదు.

**ప్రజాప్రతినిధులకు పట్టని సమస్య**

ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు లోక్‌సభ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎంపీలు గైర్హాజరయ్యారు. వీరు పంపిన ప్రతిపాదనల్లో ఆర్వోబీల ప్రస్తావనలు లేవు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కేవలం మంచిర్యాల కేంద్రంగా హాల్టింగ్ కోసం ప్రతిపాదనలు చేయగా.. ఎంపీ అరవింద్ సైతం నిజామాబాద్ కేంద్రంగా పలు ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపించారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు.

**వెంటాడుతున్న నిధుల కొరత** రైల్వే శాఖ మంజూరు చేసే ఆర్వోబీ, ఆర్‌యూపీలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంటుంది. నిధుల కొరతతో చెల్లింపులో జాప్యం కారణంగా నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో అంచనా వ్యయాలు పెరిగిపోతున్నాయి. ఒక్కో ఆర్వోబీ నిర్మాణానికి దశాబ్దకాలం పడుతుంది. బసంత్‌నగర్ సమీపంలో రెండో ఆర్వోబీ వినియోగంలోకి రావడానికి పదేళ్లు పట్టింది.

# కొత్త పోలీస్ స్టేషన్లు.. పాత సమస్యలు



యూసుఫ్‌గూడ : మెగాసిటీ పోలీసింగ్ లక్ష్యంగా రాజధానిలో కొత్త ఠాణాలు ఏర్పాటై ఏడాది దాటినా బాలారిష్టాలు తప్పడం లేదు. సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. వివిధ కేసుల్లో అరెస్టయిన నేరస్థుల్ని ఎక్కడ ఉంచాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్లు ఏర్పాటై 16 నెలలు గడుస్తున్నా పరిష్కారమవడం లేదు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ విభాగాలకు కలిపి గతేడాది జూన్‌లో అదనంగా 39 ఠాణాలను ఏర్పాటు చేశారు. సిబ్బందిని అరకొరగా కేటాయించడంతో బందోబస్తు, శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతోంది. వివిధ సమస్యలపై పీఎస్‌లకు వచ్చే బాధితులు అక్కడి పరిస్థితుల్ని అవాక్కవుతున్నారు. కొన్ని ఠాణాలు సుదూర ప్రాంతాల్లో ఉండడంతో ఏదైనా ఘటన జరిగితే పోలీసులు చేరుకోవడానికి కనీసం అరగంట పడుతోంది. కేసుల దర్యాప్తు ఆలస్యమవుతోంది. పెద్ద నేరం జరిగితే పక్క పోలీస్‌స్టేషన్లపై ఆధారపడుతున్నారు.

లేక్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బంది ఉండేవారు. దానిని సచివాలయం పోలీస్‌స్టేషన్‌గా మార్చాక ఇన్‌స్పెక్టర్, 4గురు ఎస్సైలు, డీఎస్పై, కానిస్టేబుళ్లు వచ్చారు. ఠాణా చిన్న భవనంలో ఉండడంతో సిబ్బందికి ఊపిరాడని పరిస్థితి. నాగోల్ ఠాణాను మమతానగర్‌లో నవ చైతన్య యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుళ్లు మొత్తం 44మంది ఉన్నారు. ఇద్దరు ఎస్సైలు, క్రైమ్ ఎస్సైసహా అదనంగా 30 మంది అవసరముంది. 18 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉండే నాగోల్ పీఎస్ నుంచి చివరి ప్రాంతం గౌరెల్లి వరకు 16 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి అరగంట పడుతోంది. రెండు బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనం ఉంది.

రాచకొండ పరిధిలో గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా చిన్న అద్దె ఇంట్లో ఉంది. లాకప్ లేదు. యాచారం మండలంలో 19 గ్రామాలకు కేంద్రంగా ఉండాల్సిన ఈ పీఎస్‌ను సుదూరంలోని మేడిపల్లిలో ఏర్పాటు చేశారు. అక్కడికి రవాణా సదుపాయం లేదు. ఒక ఎస్సై పోస్టు, రెండు ఏఎస్సై పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. భవనం రియల్ ఎస్టేట్ కార్యాలయం తరహాలో ఉంటుందని స్థానికులు తెలిపారు.

సదుపాయాలు, సిబ్బంది కొరతతో మధురానగర్ ఠాణా వార్తల్లో నిలుస్తోంది. అయినా పరిస్థితి మారడం లేదు. లాకప్ సదుపాయం లేక ఓ దొంగ రెండుసార్లు తప్పించుకుపోయాడు. రెహ్మత్‌నగర్ పాత పోలీసు ఔట్‌పోస్టు భవనంలోనే ఠాణా కొనసాగుతోంది. పార్కింగ్ వసతి లేక రోడ్డుపై వాహనాలను నిలపాల్సి వస్తోంది. 60 మంది కానిస్టేబుళ్లు అవసరముండగా.. పూర్తిస్థాయిలో లేరు.

ఐటీ కారిడార్ ఠాణాను యంనంపేటలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లేక ఘట్‌కేసర్ డీఐని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇన్‌స్పెక్టర్, నలుగురు ఎస్సైలు ఉన్నారు. అదనంగా 15 మంది హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు కావాల్సి ఉంది. లాకప్ లేక నిందితులను ఘట్‌కేసర్ పీఎస్‌లో ఉంచుతున్నారు. ఠాణా చౌదరిగూడ, పోచారం, వెంకటాపూర్, లింగాపూర్, ఆర్‌జీకే కాలనీవాసులకు దూరంగా ఉంది. శాశ్వత భవనానికి వెంకటాపూర్‌లోస్థలం కేటాయించినా నిధులు మంజూరు కాలేదు.

అల్లాపూర్ ఠాణాలో పురుషుల బ్యారక్ లేదు. 50కి 40మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కొత్త భవనం నిర్మించేందుకు ఎక్కడా ప్రభుత్వ స్థలం లేదు. పార్కింగ్ సదుపాయం లేక వాహనాలను రోడ్డుపై నిలపాల్సి వస్తోంది

ఖైరతాబాద్ ఠాణాను సైఫాబాద్ ట్రాఫిక్ ఠాణాలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఒకే చోట రెండు పీఎస్‌లు కొనసాగుతున్నాయి. లాకప్ లేదు. ఇందులోనే ట్రాఫిక్, శాంతి భద్రతల ఏసీపీల కార్యాలయాలూ ఉన్నాయి. కనీస వసతులు లేక పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌ను హుడా కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. నాలుగు గదుల్లోనే ఇన్‌స్పెక్టర్, డీఐ, నలుగురు ఎస్సైలు, రిసెప్షన్ సర్దుకోవాల్సి ఉంటుంది. ఎవరినైనా విచారించేందుకు పోలీసులు ఇబ్బంది పడాల్సిందే. పార్కింగ్ వసతి లేక రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీనిపై స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది.

కమిషనరేట్ పీఎస్‌లు

| | |
|---|---|
| హైదరాబాద్ | 24 |
| సైబరాబాద్ | 07 |
| రాచకొండ | 08 |

# ముదిమి వయసు.. మసక చూపు



హైదరాబాద్: జీవితాంతం కుటుంబం కోసం కష్టపడినా.. చరమాంకంలో చాలామందిది ఒంటరి పోరాటమే. మధుమేహం, అధిక రక్తపోటు, కంటిచూపు మందగించడం తదితర సమస్యలతో చాలా మంది వృద్ధులు సతమతమవుతున్నారు. ఇటీవల నగర శివారులోని ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట్‌లో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్‌ఎఫ్) స్వచ్ఛంద సంస్థ చేసిన పరీక్షల్లో ఈ విషయం తేలింది. ఈ రెండు ప్రాంతాల్లో 3500 మందికి స్క్రీనింగ్ చేయగా.. 800 మందిలో అధిక రక్తపోటు, మధుమేహం గుర్తించారు. మరో 200 మంది వృద్ధుల్లో నేత్ర సమస్యలున్నాయి.

**గుర్తించారు.. చికిత్సలు చేయలేదు**

గత ప్రభుత్వ హయాంలో కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేసినప్పుడు పెద్దఎత్తున కంటి శుక్లాల సమస్యలు బయటపడ్డాయి. వారికి చికిత్సలు అందలేదు. చాలా మంది వృద్ధులకు శుక్లాలతో కంటిచూపు మందగించినా.. కుటుంబ సభ్యుల ఆదరణ లేక చికిత్సకు నోచుకోవడంలేదు. ముందే గుర్తించి చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చని వైద్యులు తెలిపారు. కొందరు వృద్ధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేశామని, కొందరికి అద్దాలందించామని హెచ్‌హెచ్‌ఎఫ్ అధ్యక్షుడు హసన్ అస్కరీ తెలిపారు.

**ఈ లక్షణాలుంటే నిర్లక్ష్యం వద్దు**

చూపు పొగబారినట్లు ఉండటం
వస్తువుల రంగులు పాలిపోయినట్లు కనిపించడం
రాత్రి చూపు సక్రమంగా లేకపోవడం
రాత్రి డ్రైవింగ్ చేయడంలో ఇబ్బందులు
మసక వెలుతురులో చదవడంలో సమస్య
ఒక వ్యక్తి లేదా వస్తువు రెండుగా కనిపించడం
కంటి ఎదురుగా రంగుల గోళాలు ఉండటం

# మెరుగైన వసతులే లక్ష్యం



పరిగి : జిల్లా సమగ్రాభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో అభివృద్ధి మరింత వేగిరంగా చేపట్టి ప్రజల ఇబ్బందులను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈక్రమంలోనే ఇటీవల వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా) ఏర్పాటు చేయగా మరో ముందడుగు కింద తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా సమయంలో వికారాబాద్‌కు తగిన ప్రాధాన్యం రాలేదు. దీంతో నేటికీ ప్రజలు మౌలిక సదుపాయాల లేమితో అవస్థలు పడుతున్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏర్పాటైందే వుడా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు విడుదల కానుండటంతో అభివృద్ధి పట్ల ఆశలు రేకెత్తుతున్నాయి.

**ఒనగూరే ప్రయోజనాలు**

ప్రధాన ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల ఉన్న గ్రామాలపై నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా పనిచేసేందుకు అవకాశం. సమాన స్థాయిలో పనులు జరగడంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడేందుకు దోహదం. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో వివిధ ప్రాజెక్టులు మంజూరయ్యే అవకాశముంది. కేంద్రం నుంచి అధిక నిధులు మంజూరవతాయి. చిన్న చిన్న పరిశ్రమల రాకతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు చెబుతున్నారు. పాలనాపరమైన కొత్త వ్యవస్థలు, విధానాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

నియోజకవర్గాలు- 4
మండలాలు- 20
పంచాయతీలు - 566
జనాభా - 12.5లక్షలు
అథారిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలు- 493
కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్

వుడా కమిటీని ప్రభుత్వం తాత్కాలికంగా ఐదుగురి సభ్యులతో ఏర్పాటు చేసింది. ఇందులో కలెక్టర్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ ఛైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మిగతా ముగ్గురిలో ప్రత్యేక చీఫ్ సెక్రెటరీ, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ కొనసాగుతారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్ పాత మున్సిపాలిటీలు ఉండగా పరిగి, కొడంగల్ ప్రాంతాలు పంచాయతీ హోదా నుంచి పుర స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం నాలుగింటిని కూడా అథారిటీలో చేర్చారు.

**రూపురేఖలు మార్చేస్తాం** – టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి.

వుడా ఏర్పాటుతో జిల్లా సమగ్రాభివృద్ధికి చక్కటి అవకాశం కలిగింది. ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయి. ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం. సీఎం ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యపడింది. పరిగి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం.

# కదలని ధాన్యం.. అన్నదాత దైన్యం

కొత్తపల్లి : జిల్లాలో ఈ వానాకాలంలో 2.9 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశారు. మొత్తం 324 కొనుగోలు కేంద్రాలకు 316 చోట్ల ప్రారంభించారు. సుల్తానాబాద్, ధర్మారం, ఎలిగేడు మండలాల్లో 16 చోట్ల మినహా ఎక్కడా కొనుగోళ్లు మొదలవలేదు. చాలా గ్రామాల్లో కేంద్రాల్లో ఆరబోసి రోజుల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారు. కేంద్రాల్లో సుమారు 5 వేల టన్నుల ధాన్యం ఆరబోసినట్లు అధికారులు చెబుతున్నా వాస్తవానికి అంతకు రెట్టింపు మొత్తంలో ఉంటుంది. ఇప్పటివరకు 200 టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారులు



పేర్కొంటున్నారు.

ఎందుకు ఈ పరిస్థితి!

కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయమై స్పష్టత కొరవడింది. గతంలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద బియ్యం ఇవ్వని మిల్లులను ఈసారి బ్లాక్ లిస్టులో పెట్టారు. వారి నుంచి బ్యాంకు గ్యారంటీని ప్రభుత్వం కోరింది. పూచీకత్తు విషయమై జాప్యం నెలకొనడంతో ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఓపీఎంఎస్)లో సమస్య తలెత్తింది. మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోవడంతో లారీలు అక్కడే నిలిచిపోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు చర్చిస్తుండటంతో కొందరు మిల్లర్లు పూచీకత్తు ఇవ్వడానికి ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారం

– శ్రీకాంత్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించాం. మిల్లర్ల బ్యాంకు పూచీకత్తుకు సంబంధించి ఆన్‌లైన్ అనుమతికి జాప్యం నెలకొంది. మిల్లర్లతో కలెక్టర్ చర్చించడంతో అంగీకరించారు. ఒకట్రెండు రోజుల్లో ఆన్‌లైన్ సమస్య పరిష్కారమవుతుంది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాం. ఎక్కడా తడిసిపోలేదు.

పది రోజులుగా ఇక్కడే..– కలవేన మల్లేశ్, కొత్తపల్లి, పెద్దపల్లి మండలం

ఏడున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. పది రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ఆరబోస్తున్నా. నిర్ణీత తేమ శాతం వచ్చింది. రెండు రోజులుగా అకాల వర్షాలకు తడిసిపోకుండా పరదాలు కప్పుతున్నా. పొద్దంతా కల్లంలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

# అదను చూసి అమ్మేయొచ్చు!

జగిత్యాల : బజారుకెళ్లి ఏ వస్తువు కొనుగోలు చేసినా, దానిపై తయారీ తేదీ, వాడేందుకు తుది గడువు ముద్రించి ఉంటాయి.. నిత్య జీవితంలో విరివిగా వాడే పంట ఉత్పత్తులపై మాత్రం ఈ వివరాలు కనిపించకపోవడాన్ని ఎప్పుడైనా గమనించారా..! వివిధ సరకుల తయారీదారులు తమకు లాభం వచ్చినపుడు అమ్మేందుకు వీలుగా ఉత్పత్తులను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తుంటారు.. వందల క్వింటాళ్ల పంటలు పండించే రైతు మాత్రం ఆ వసతి లేక ఎప్పటికప్పుడు విక్రయించాల్సి వస్తోంది.. గిట్టుబాటు లేకున్నా వచ్చిన ధరకు అమ్ముకోవాల్సిందే.. శీతల గిడ్డంగులు(కోల్డ్ స్టోరేజీలు) ఏర్పాటు చేసుకోవడమే ఇందుకు ప్రత్యామ్నాయం..

పంట ఉత్పత్తులు చేతికందిన సమయంలో మార్కెట్లో ధరలు తక్కువగా ఉంటే కొన్ని రోజుల పాటు నిల్వ చేసి అమ్మడం ద్వారా గిట్టుబాటు ధర పొందే వీలుంటుంది. కొన్ని రకాల పంట ఉత్పత్తుల నిల్వకు సాధారణ గోదాములు సరిపోతే మరికొన్నింటికి శీతల గిడ్డంగుల అవసరముంటుంది. భిన్న పంటల సాగు పరంగా రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్న ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తుల నిల్వకు వసతులు లేక రైతులతో పాటు వినియోగదారులూ నష్టపోతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఎనిమిది**

కోల్డ్ స్టోరేజీల్లో ఎండుమిరప, ఉడికించి ఆరబెట్టిన పసుపు కొమ్ములు, చింతపండు, ఆలుగడ్డలు, టమాట, యాపిల్స్, కందులు, పెసలు, మినుములు తదితర పంట ఉత్పత్తులను నిల్వ చేయొచ్చు.

ఉమ్మడి జిల్లాలో కేవలం 8 కోల్డ్ స్టోరేజీలుండగా వీటిల్లో కేవలం 4 లారీల సరకులను మాత్రమే నిల్వ చేసే వీలుంది.

ఉమ్మడి జిల్లాలో వేలాది మెట్రిక్ టన్నుల పంటలు పండిస్తుండగా నిల్వ సౌకర్యం లేక అప్పటికప్పుడు పలికే ధరలకే తెగనమ్ముకొని రైతులు నష్టపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న టమాటలు, యాపిల్స్ తదితర కూరగాయలు, పండ్లను ఇక్కడ నిల్వ చేసే సదుపాయాలు లేక వ్యాపారులు, మధ్యవర్తులు నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లా ఉత్పత్తులకు కనీసం వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీలు అవసరమవుతాయని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో 14 వరకు కోల్డ్ రైపెనింగ్ ఛాంబర్లుండగా వ్యాపారులు అరటి, సపోట, మామిడి కాయలను మాగవేసి పండ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

**5 మెట్రిక్ టన్నులకు రూ.2.40 కోట్లు**రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీవోలు), మహిళా స్వశక్తి సంఘాలు, రైతుమిత్ర గ్రూపులు, సహకార సంఘాల(ప్యాక్స్)తో పాటు సాగుకు అనుబంధంగా కొనసాగుతున్న వారికి కోల్డ్‌స్టోరేజ్‌ల ఏర్పాటులో ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పిస్తోంది. 5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్ ఏర్పాటుకు రూ.2.40 కోట్ల ఖర్చవుతుంది. ఇందులో రూ.కోటి రాయితీ ఉంది. డిటెయిల్స్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్), స్థలం పత్రాలు, తమ వాటా నిధులకు బ్యాంకు రుణం తదితర వివరాలు సమర్పించిన తర్వాత నిబంధనల మేరకు కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణాలకు విడతల వారీగా రాయితీని విడుదల చేస్తారు. రైపెనింగ్ ఛాంబర్లకు 33 శాతం రాయితీ ఉంది. మామిడి రైతులు, ఎఫ్‌పీవోల ద్వారా రైపెనింగ్ ఛాంబర్లను నిర్మించుకొని రైతుల నుంచి నేరుగా ఉత్పత్తులు కొని పండ్లుగా మార్చి వినియోగదారులకు నేరుగా విక్రయించే వీలుంది.

**ఉభయులకు లాభదాయకం**ఉమ్మడి జిల్లాలో పసుపు, మిరప, వేరుశనగ, చిరుధాన్యాలు తదితర పంటలను అధికంగా సాగు చేస్తుండగా గిట్టుబాటు ధర లేని సమయంలో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకొని మంచి ధర ఉన్నపుడు విక్రయించవచ్చు.

# రూ.135 కోట్లు.. 14 కి.మీలు ... 6వరుసలు

హైదరాబాద్ : నగరంలో కీలక మార్గాల్లో ఒకటైన గండిమైసమ్మ–మియాపూర్ రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. దాదాపు రూ. 135 కోట్ల నిధులతో 14 కి.మీ. వరకు 4 నుంచి ఆరు వరుసలుగా విస్తరించనున్నారు. ఏడాదిలోగా అందుబాటులోకి తెచ్చేలా హెచ్‌ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పూర్తయితే మల్లంపేట్ వద్ద నిర్మించిన ట్రంపెట్ నుంచి అవుటర్‌పైకి వెళ్లవచ్చు. గండిమైసమ్మ నుంచి అవుటర్ వైపు వెళ్లేందుకు ఈ మార్గం కీలకం. నాగ్‌పూర్ జాతీయ రహదారి 65తో లింకు ఏర్పడుతుంది.

**అటవీ భూమితో ఆటంకం..** ఈ రహదారి విస్తరణలో మరో అడ్డంకి పొంచి ఉంది. దూలపల్లిలో 2.3 కి.మీ.వరకు అటవీశాఖ భూమి ఉంది. దీనిని హెచ్‌ఎండీఏకు అప్పగిస్తేనే పనుల్లో వేగం పుంజుకునే వీలుంటుంది. ఇప్పటికే హెచ్‌ఎండీఏ అటవీశాఖ దృష్టికి తీసుకెళ్లింది. ప్రత్యామ్నాయంగా అటవీశాఖకు అంతకు సమానమైన భూమి కేటాయించాల్సి ఉంది.

**సమస్య:** ప్రస్తుతం 4 వరుసలుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడు



తోంది.గండిమైసమ్మ నుంచి మియాపూర్ వరకు భారీగా రద్దీ ఉంటోంది. ఉదయం 9 నుంచి 11 వరకు, సా.4 గంటల నుంచి మళ్లీ రాత్రి 8 వరకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

**ప్రయోజనం:** 20 లక్షలమందికి ప్రయోజనం కలుగుతుంది. ఐడీఏ బొల్లారం, బొంతపల్లి, మల్లంపేట్, నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, దుండిగల్, దూలపల్లి, గాజుల రామారం, బౌరంపేట్‌లకు ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బాచుపల్లి కూడలి వద్ద 1.32 కి.మీ.మేరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.

**తొలగింపు... తరలింపు**


రోడ్డుకు ఇరువైపులా 14 కి.మీ.మేర ముఖ్యమైన 1092 చెట్లు ఉన్నట్లు ట్రీ ప్రొటెక్షన్ కమిటీ లెక్కకట్టింది. ఇప్పటికే 603 చెట్లు ట్రాన్స్‌లోకేట్ చేసినట్లు హెచ్‌ఎండీఏ చెబుతోంది. కొన్ని కొత్వాల్‌గూడ ఏకో పార్కులో, మరొకొన్ని కొత్త పార్కుల్లో నాటనున్నారు.

# విద్యుత్తు బిల్లుల వడ్డన కొందరికే

హైదరాబాద్: కొత్త విద్యుత్తు ఛార్జీల టారిఫ్‌తో నగరంలోని కొన్ని వర్గాలకు స్వల్పంగా విద్యుత్తు బిల్లులు పెరగనున్నాయి. నేరుగా ఛార్జీల రూపంలో కాకుండా పరోక్షంగా స్థిర(ఫిక్సెడ్) ఛార్జీల రూపంలో డిస్కం వడ్డించనుంది. సవరించిన టారిఫ్ ఈనెల ఒకటినుంచే అమల్లోకి వచ్చింది. వచ్చేనెల బిల్లులను కొత్త ఛార్జీల ప్రకారం జారీ చేయనున్నారు. పెంపు భారం రూ.30 కోట్ల వరకు ఉండగా గరిష్ఠంగా నగరంపైనే పడింది.

**టౌన్‌షిప్‌లలో..**

గేటెడ్ కమ్యూనిటీ వర్గాలకు కరెంటు బిల్లులు స్వల్పంగా పెరగనున్నాయి. కిలోవాట్‌కు నెలవారీ ఇన్నాళ్లు రూ.260 స్థిర ఛార్జీలు ఉండగా.. ఇప్పుడు రూ.285కు పెంచారు. ఒక్కో కిలోవాట్‌పై రూ.25 పెరిగింది. ఈ ప్రకారం 1500 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన కనెక్షన్లున్న కమ్యూనిటీలో నెలకు రూ.37,500 బిల్లు పెరగనుంది. ఈ మొత్తాన్ని



రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాలు కమ్యూనిటీలోని వినియోగదారులకు బదలాయించనున్నాయి.

టౌన్‌షిప్‌లకు విద్యుత్తు టారిఫ్ 11కేవీ, 32, 132 కేవీ ఏదైనా యూనిట్‌కు రూ.7.30 వసూలుచేస్తున్నారు. దీన్ని మార్చలేదు.

మెట్రో స్థిర ఛార్జీలు రూ.25 పెంపు

మెట్రో రైలుకు హెచ్‌టీ–5బి విభాగం కింద విద్యుత్తు సరఫరా చేస్తోంది. యూనిట్ రూ.4.95 ఛార్జీలు వసూలుచేస్తోంది. కిలోవాట్‌కు స్థిర ఛార్జీ రూ.475 వసూలు చేస్తుండగా, రూ.500కు పెంచారు.

నగరంలో పెద్దసంఖ్యలో ప్రార్థనా మందిరాలున్నాయి. ఈ కనెక్షన్లపై స్థిర ఛార్జీలు రూ.260 ఉండగా..రూ.285కు పెంచారు. యూనిట్ ఛార్జీల్లో మార్పు చేయలేదు.

వీరికి పెరిగాయ్.. నెలకు 800 యూనిట్లపైన వినియోగించేవారు నగరంలోనే అత్యధికంగా ఉంటారు. వీరికి కిలోవాట్‌కు స్థిర ఛార్జీ రూ.10 ఉండగా.. ఏకంగా రూ.50కి పెంచారు. ఈ వర్గాలకు ఇది పెద్ద భారం కాదని డిస్కం అంటోంది.

**రూ.30 కోట్ల వరకు..**రాష్ట్రంలో రూ.1200 కోట్ల ఛార్జీల పెంపునకు డిస్కం ప్రతిపాదించగా.. అందులో రూ.1170 కోట్ల వరకు భరించేందుకు సర్కారు ముందుకొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.30కోట్లే వినియోగదారుల నుంచి వసూలుకు అనుమతి ఇచ్చామని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి తెలిపింది.

# రహదారులే కల్లాలు.. తప్పని ప్రమాదాలు

కొడంగల్ : కల్లాలు లేక ఆరుగాలం కష్టపడి పండించిన జొన్న, పెసర, మినుములు, వరి ధాన్యం నూర్పిళ్లు, ఆరబోతకు అన్నదాతలకు రహదారులే ఆధారంగా నిలుస్తున్నాయి. ఫలితంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి జారిపడి గాయాల పాలవుతున్నారు. కొన్నిచోట్ల ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు తప్పించుకోలేక పరస్పరం ఢీకొని మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో చాలానే జరిగాయి. కల్లాలు నిర్మిస్తున్నామని చెబుతున్న అధికారుల హామీలన్నీ మాటలకే పరిమితం అవుతున్నాయి. అన్నదాతలు వేరే మార్గం లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెడతున్నారు.కుల్కచర్ల మండల పరిధిలోని ఘనాపూర్, రాంనగర్, ముజాహిద్‌పూర్ గ్రామాల పరిసరాల్లో ప్రధాన రోడ్లపై ఎక్కువగా జొన్న, వరి ధాన్యం ఆరబోస్తూ నూర్పిళ్లు చేస్తున్నారు. తరువాత వృథాగా మారిన కంకులు, గడ్డిని అలాగే వదిలి వెళుతున్నారు.ఇటీవల దుద్యాల మండలంలోని సాగారం తండా వద్ద రోడ్డుపైనే ధాన్యం పోయడంతో గమనించని ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కిందపడిపోయాడు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారితో పాటు కోస్గి–తుంకిమెట్ల, బాపల్లితండా–కొడంగల్ రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. సాయంత్రం కాగానే కుప్పగా చేసి వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్లపై వాహనదారులు వీటిని గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై ఎండబెట్టి నూర్పిళ్లు చేయడం వల్ల దుమ్ము, ధూళి వాహనదారుల కళ్లలోకి చేరి కింద పడిపోతున్నారు. ఆరబెట్టవద్దని పోలీసులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా కల్లాలు లేక ప్రయోజనం చేకూరడంలేదు.

# చెరకు.. మిగిలేదేంటి చివరకు..



అనకాపల్లి : జిల్లాలో చెరకు సాగు భారీగా తగ్గింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది కేవలం 5,821 హెక్టార్లలోనే సాగు చేశారు. దశాబ్దం క్రితం వరకూ 42 వేల హెక్టార్లకు తక్కువ లేకుండా సాగు చేసేవారు. ఆ తర్వాత నుంచి ఏటా తగ్గుతూ వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో చెరకు సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. ఉన్న ఒక్క గోవాడ ఎప్పుడు మూతపడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు చెరకు సాగుపట్ల ఆసక్తి చూపడం లేదు. పోనీ బెల్లం తయారీ చేద్దామంటే వాటి ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పసుపు ఆకు తెగులు కారణంగా తోట ఎదుగుదల లేక దిగుబడులు సగానికి పైగానే పడిపోతున్నాయి. మరోవైపు సాగు ఖర్చులు ఏటేటే పెరుగుతూ వస్తున్నాయి. దీంతో చెరకు పంట అంటేనే రైతులు హడలిపోయే పరిస్థితి ఏర్పడింది.

**పీడిస్తున్న తెగుళ్ల...**

పసుపు ఆకు తెగులు కారణంగా దిగుబడులు సాగానికి సగం తగ్గిపోయాయని రైతులు తెలిపారు. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి రావాల్సి ఉన్నా 15 టన్నులకు మించడం లేదు. పంట మార్పిడి చేసుకోవాలని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. పసుపు ఆకు తెగులుపై పరిశోధనలు చేస్తున్నామని, తెగులును తట్టుకునే రెండు రకాలు గుర్తించామన్నారు.


**పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ**

అందరికీ తీపిని పంచే చెరకు రైతులు ప్రస్తుతం చేదును అనుభవిస్తున్నారు. ఆరుగాలం కుటుంబం అంతా కష్టపడినా అప్పులు మాత్రమే మిగులుతున్నాయని రైతులు దాడి సీతారాము, టెక్కలి కొండలరావు వాపోయారు. చెరకు దీర్ఘకాలిక పంట. పంట పక్వదశగా రావాలంటే 10 నుంచి 11 నెలల సమయం పడుతుంది. ఎకరా భూమిలో చెరకు సాగు చేసేందుకు రూ. 77 వేలు ఖర్చు అవుతుంది. ఆదాయం రూ. 60 వేలకు మించడం లేదని రైతులు వాపోతున్నారు. ఏడాది పాటు పుష్కలంగా సాగు నీరు లభించే మునగపాక ప్రాంతాలలోనూ రైతులు చెరకు సాగుకు బదులు సరుగుడు వేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**సరుగుడు మేలు- పిట్ల రామారావు, రైతు, నాగవరం**

పదేళ్లగా వ్యవసాయం చేస్తున్నాను. గత ఐదేళ్లగా చెరకు తోటలకు తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. శాస్త్రవేత్తలు చెప్పినట్లు చేస్తున్నా తెగులు మాత్రం తగ్గడంలేదు. గతంలో ఎకరాకు 32 టన్నులు దిగుబడి వచ్చేది. ఇప్పుడు 14 టన్నులకు మించి రావడం లేదు. ఏటా నాలుగు ఎకరాలలో చెరకు సాగు చేసే వాడిని. ఇప్పుడు రెండు ఎకరాల్లోనే వేశాను. మిగిలిన భూమిలో వరి వేస్తున్నాను. చెరకు కంటే సరుగుడు సాగు బాగుంది.

# చెరువుల కబ్జాలకు చెక్ పెట్టేలా!.. సర్వేతో పక్కా లెక్కలు.. జియో ట్యాగింగ్‌తో హద్దులు



హైదరాబాద్ : చెరువులు.. జలవనరులను ఎవరూ ఆక్రమించకుండా రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పక్కాగా లెక్కలు సిద్ధంచేస్తున్నారు. గ్రామ నక్షాలు, డిజిటల్ సర్వేల సహాయంతో వాటి విస్తీర్ణాన్ని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ణయిస్తున్నారు. ప్రతి చెరువుకు జియోట్యాగ్ ఏర్పాటుచేసి హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో 1075 చెరువులుండగా 107వి పూర్తిచేసి హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రత్యేక బృందాలుగా మిగిలినవాటి తుది సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.

ప్రహరీలతో కలిపేసుకున్నారు..

**రెవెన్యూ అధికారుల సర్వేలో..** చెరువుల సమీపంలో వెంచర్లు వేసినవారు, రియల్ సంస్థల ప్రతినిధులు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించిన వారిలో కొందరు బఫర్‌జోన్లలో కొన్ని స్థలాలను ఆక్రమించుకున్నారని గుర్తించారు. వెంచర్లు, బహుళ అంతస్తుల ప్రహరీలు ఎంత పొడవున్నాయో అంత.. పదడుగుల నుంచి ఇరవై అడుగుల వెడల్పు ప్రాంతాన్ని కలిపేసుకున్నారు. ఇలాంటి ఆక్రమణలు శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని అధికారుల పరిశీలనలో తేలింది. యాభైకి పైగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను కొందరు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు మార్చేసి నిర్మాణాలు చేపట్టారు. గండిపేట మండలంలో ఒక ప్రైవేటు వ్యక్తి బఫర్‌జోన్‌లో విల్లాలు నిర్మించగా.. వాటిని కూల్చేసి కొత్తగా బఫర్ జోన్ హద్దులను అధికారులు ఏర్పాటుచేశారు. శేరిలింగంపల్లిలో ఓ రియల్ సంస్థ ముప్పై అడుగుల వెడల్పుతో 750మీటర్ల పొడవు బఫర్ జోన్‌ను తమ ప్రహరీలో కలిపేసుకుంది.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు**

ఆక్రమించిన జల వనరులు, చెరువుల భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను రెవెన్యూ అధికారులు నియమించారు. ఈ బృందాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో పాటు హైడ్రా అధికారులు ఉన్నారు. వీరు రియల్ వెంచర్ల సమీపంలోని చెరువులపై దృష్టి కేంద్రీకరించి రెండుమూడు రోజులకోమారు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించనున్నారు. ప్రాధాన్య ప్రాంతాల్లోని చెరువుల్లో కొన్నింటికి సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు. వెబ్‌సైట్‌లో వివరాలతో పాటు ప్రతి చెరువు పరివాహక ప్రాంతాన్ని జియో ట్యాగింగ్ చేయనున్నారు. దీంతో, చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తే వెంటనే అధికారులకు తెలిసిపోతుంది.

జిల్లాలో మొత్తం చెరువులు 1075

సర్వేకు గుర్తించినవి 981ప్రాథమిక సర్వే పూర్తయినవి 894

తుది సర్వే పూర్తయినవి 107

# మెట్రో -2 భూ సేకరణకు చిక్కులు తక్కువే



హైదరాబాద్ : మెట్రో రైలు రెండోదశలో పాతబస్తీ మార్గంలో మినహా మిగతా నాలుగు కారిడార్లలో పెద్దగా భూసేకరణ చిక్కులు లేవు. ఆయా కారిడార్ల నిర్మాణానికి పాతబస్తీ కంటే తక్కువ వ్యయమవుతుందని సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో అంచనా వేసింది. సెంట్రల్ మీడియన్ మీదుగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. మెట్రో రెండోదశ మొదటి భాగంలో 76.4 కి.మీ. ప్రతిపాదించారు. రూ.24,269 కోట్లు వ్యయంగా అంచనా వేశారు. సగటున కిలోమీటర్ నిర్మాణానికి 317.65 కోట్లు అవుతుంది.

ఈ కారిడార్‌లోనే చిక్కులు: ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మార్గంలో 1400వరకు ఆస్తులు సేకరణ, రహదారి విస్తరణ చేపట్టాలి. వీటికే రూ.800కోట్ల దాకా వ్యయమవుతుందని అంచనా. కి.మీ.కి రూ.365.46 కోట్లవుతుందని అంచనా వేశారు.

**అధిక ఖర్చు ఇక్కడే:** రాయదుర్గం–కోకాపేట నియో పోలీసు వరకు 11.6 కి.మీలకు వ్యయ అంచనా రూ.4318 కోట్లు. ఇక్కడ భూముల ధరలే కారణం. సగటున కి.మీ.నిర్మాణానికి రూ.372 కోట్లవుతుందన్నారు. రెండోదశలో అత్యధిక సగటు వ్యయం ఇదే.

అత్యల్పం హయత్‌నగర్ మార్గంలో.. ఎల్బీనగర్ – హయత్‌నగర్ జాతీయ రహదారి మార్గంలో 7.1కి.మీ మెట్రోని ప్రతిపాదించారు. రూ.1877 కోట్లవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.264 కోట్లు అవుతుంది. అన్ని కారిడార్ల కంటే అత్యల్ప వ్యయం ఇక్కడే. **ఈ రెండు మార్గాల్లో...**

నాగోల్‌నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కి.మీ. ఉంటుంది. రూ.11,226 కోట్ల అవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ. మెట్రో నిర్మాణానికి ఇక్కడ వెచ్చించాల్సిన వ్యయం రూ.305 కోట్లు. పెద్దగా భూసేకరణ సమస్యలు లేవని అధికారులు చెప్పారు. మియాపూర్–పటాన్‌చెరు మార్గంలో 13.4 కి.మీ.కు గాను రూ.4107 కోట్లు అంచనా వేశారు. సగటు కి.మీ.కు రూ.306 కోట్లు.

బెంగళూరు, చెన్నైకంటే తక్కువే

ప్రస్తుత మెట్రో రెండోదశ పనులు జరుగుతున్న బెంగళూరులో 75 కి.మీ.కు రూ.40వేల కోట్లు, చెన్నైలో 118.9 కి.మీ.కు రూ.63,246 కోట్లుగా అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.531 నుంచి రూ.533 కోట్లు అవుతుంది. దీంతో పోలిస్తే చాలా తక్కువ వ్యయంతో హైదరాబాద్ మెట్రో–2 నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని అధికారులు చెబుతున్నారు. ఆప్టిమల్ డిజైన్‌తో అంచనా వ్యయాలు తగ్గించేలా జాగ్రత్త తీసుకున్నామన్నారు. నిర్మాణం సైతం వేగంగా పూర్తయ్యేలా చర్యలుంటాయని చెప్పారు.

# దండిగా తోడేశారు!

ఎల్లారెడ్డిపేట : జిల్లాలో భూగర్భ జలాలను దండిగా తోడేశారు. అక్టోబరులో సాగుకు భారీగా వాడటంతో ఒక్క నెలలోనే 0.07 మీటర్లకు తగ్గిపోయాయి. వేములవాడ అర్బన్‌లో భూగర్భజల మట్టాలు ప్రమాద ఘంటికలను మోగిస్తుండగా 11.6 మీటర్ల లోతున కూడా పాతాళగంగ పైకిరానంటోంది. జిల్లాలోని రుద్రంగిలో మాత్రం 2.71 మీటర్ల అత్యల్ప లోతున నీరు లభిస్తోంది. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరిపంటను వేశారు. పైరు పొట్టదశ నుంచి ఈనే దశ వరకు భారీగా సాగునీరు అవసరమవుతుంది. ఈ సమయంలో పంటకు నీరందించే క్రమంలో బోర్లు, బావులను నిరంతరాయంగా నడపడం వల్ల భూగర్భజల మట్టాలు సాధారణంగానే కొంతమేర తగ్గిపోతాయని భూగర్భజలశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం, భూగర్భ జల మట్టాలు ఆశాజనకంగా ఉండటంతో ఏటా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో జూన్ నుంచి నవంబరు 3 వరకు 814.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 966.4



మిల్లీమీటర్లు కురిసింది. దీన్ని బట్టి చూస్తే 19.0 శాతం ఎక్కువగా వర్షాలు పడ్డాయి.జిల్లాలో 2,32,046 ఎకరాల్లో వివిధ రకాల పంటలను వేయగా, అందులో సుమారు 1,80,310 ఎకరాల్లో వరి, 1246.24 ఎకరాల్లో మొక్కజొన్న, 49,332 ఎకరాల్లో పత్తిని ప్రధాన పంటలుగా సాగు చేశారు.

ఈ సంవత్సరం జూన్‌లో సగటు భూగర్భజల మట్టాలు 11.52 మీటర్లు, జులైలో 10.29 మీటర్లు, ఆగస్టులో 8.15 మీటర్లు, సెప్టెంబరులో 5.76 మీటర్లు, అక్టోబరులో 5.83 మీటర్ల లోతులో ఉన్నాయి.

గత నెల నుంచి అక్టోబరు వరకు ఒక్క నెల వ్యవధిలో 0.07 మీటర్లకు తగ్గిపోయాయి.గతేడాది అక్టోబరుతో పోల్చితే 1.05 మీటర్లు తగ్గిపోయాయి. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, అందులో వరి ఎక్కువగా ఉండటం వల్ల భూగర్భజలాల వినియోగం భారీగా పెరిగింది.

వరి పంటకు పొట్ట, ఈనే దశలో సాగునీరు ఎక్కువగా వాడాల్సి వచ్చింది. దీంతో భూగర్భజలాల తోడకం బాగా పెరిగింది. సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకు 0.07 మీటర్లకు తగ్గిపోయింది.

**సమృద్ధిగా వర్షాలతో...**జిల్లాలో ఈ సంవత్సరం నవంబరు 3 వరకు చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో అధిక వర్షపాతం నమోదవగా రుద్రంగి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, కోనరావుపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో వర్షాలు సాధారణానికి పరిమితమయ్యాయి.జిల్లాలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన చెరువులు 94, వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉన్నవి 539. మొత్తం 633 చెరువులకు గాను 213 మత్తడి పారాయి. ఇందులో 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న 39 చెరువులు, 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న 174 చెరువులు సైతం మత్తడి దూకాయి.

# అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతల ఆవేదన

కరీంనగర్ : ఇలా జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల గడప దాటని భూబాధితుల సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రతి నిర్వహించే ప్రజావాణికి సుమారు రెండొందలపైనే ఫిర్యాదులు వస్తుంటాయి. ఇందులో సింహభాగము భూ సమస్యలే. జిల్లావ్యాప్తంగా మెజారిటీ రైతులు వ్యవసాయ పనులను పక్కనపెట్టి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని చూసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది.

**లెక్కకు మించి దరఖాస్తులు**

రైతులకు వంద శాతం మేలు చేయాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ శాఖ మంత్రి సూచిస్తూనే ఉన్నారు. పేరుకుపోయిన అర్జీలను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిష్కరించేలా జిల్లా ఉన్నతాధికారులు భావిస్తున్నా.. అపరిష్కృత దరఖాస్తులు లెక్కకుమించి ఉన్నాయి. రైతుల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని.. పరిష్కరించే దిశగా కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.

**ప్రభుత్వ భూమిగా నమోదు**



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడుకు చెందిన రామోజు శివకుమార్. ఈ యువరైతుకు వారసత్వంగా వచ్చిన పట్టా భూమిని అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూమిగా నమోదైంది. రికార్డుల నుంచి ప్రభుత్వ భూమిగా తొలగించాలని కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా.. న్యాయం జరగకపోవటంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు రైతుకు సానుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా న్యాయం కోసం ప్రజావాణి, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ పట్టా మార్పిడి చేయాలని తిరుగుతున్నాడు.

**కోర్టు తీర్పు ఇచ్చినా..**కరీంనగర్ గ్రామీణ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన నారాయణకు దుర్శేడు గ్రామ రెవెన్యూ పరిధిలో 2.11 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేది. ఇందులో రైల్వే లైన్ నిర్మాణంలో 0.38 ఎకరాల భూమి కోల్పోయాడు. మిగతా స్థలం సైతం రైల్వే లైన్ సర్వేలో కోల్పోయినట్లు ధరణిలో చూపిస్తోంది. తన పేరున పట్టా చేయాలని ప్రజావాణి, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ధరణిలో ఆప్షన్ లేదని అధికారులు దాటవేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. తీర్పు రైతుకు అనుకూలంగా వచ్చింది. అయినా న్యాయం జరగడంలేదు.

# నాటు వేసేందుకే మొగ్గు

ఆత్మకూర్: నెమ్మికల్‌లో నాటు వేసిన పొలం : జిల్లాలో ప్రధాన పంటగా వరిసాగు చేపడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా.. వరి వైపే అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. వివిధ పద్ధతుల ద్వారా సాగుకు పెట్టుబడులు తగ్గించే అవకాశం ఉన్నా.. రైతులు ఆ దిశగా మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా నాట్లు వేసే సమయంలో కూలీల కొరత అధికంగా ఉండటంతోపాటు ఎకరాకు రూ.5 వేల వరకు కూలీలకే వెచ్చించాల్సిన పరిస్థితి. కూలీల సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతిని ఉపయోగించే అవకాశం ఉన్నా రైతులు ఆ దిశగా యోచన చేయడం లేదు. ఈ పద్ధతిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా.. పని ఒత్తిడి కారణంగా పట్టించుకోవడం లేదు. పంట దిగుబడి రాదేమోనని, చీడపీడల బెడద అధికంగా ఉంటుందని, అధిక పెట్టుబడికి వెనకాడకుండా నాటు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతులపై అన్నదాతలు మొగ్గు



చూపితే చాలా వరకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉండటంతోపాటు దిగుబడి కూడా పెరుగుతోంది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

లక్షన్నర ఎకరాల్లోపే..జిల్లాలో ఈ వానాకాలం ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో 4,46,652 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కాగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతి ద్వారా కేవలం లక్షన్నర లోపే ఎకరాల్లో మాత్రమే చేపట్టడం గమనార్హం. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతోంది. డీజిల్, ఎరువులు ధరలు పెరగడంతో అదనంగా మరో రూ.3 వేల భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దిగుబడి ఆశాజనకంగా ఉంటే రూ.40 వేల వరకు రాబడి వస్తోంది. చీడ పీడలు, వర్ష ప్రభావం ఎక్కువ ఉన్నా.. తక్కువ ఉన్నా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో పెట్టుబడులు అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానాన్ని అవలంబిస్తే రైతులకు చాలా వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది.

దృష్టి సారించాలి

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానంపై రైతులు దృష్టి సారించాలి. పంటకు పెట్టుబడి చాలా వరకు తగ్గుతోంది. దిగుబడిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రుణమాఫీ, పంట లెక్క వేసే మండల అధికారులు నిమగ్నం కావడంతో అవగాహన కల్పించే సమయం లేదు. యాసంగిలో ఈ విధానంపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తాం.

వెదజల్లు విధానంతో ప్రయోజనాలు:

నాటు విధానం ద్వారా ఎకరాకు 25 కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లు పద్ధతిలో 12 నుంచి 15 కిలోలు సరిపోతాయి.

నాటు వేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చు అవుతోంది. డ్రమ్ సీడర్, వెదజల్లు ద్వారా అయితే కేవలం రూ.500 మాత్రమే అవుతాయి.

నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగడంతో పిలకలు తక్కువగా వస్తాయి. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువ వస్తాయి. దిగుబడులు పెరుగుతాయి.

వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపు నివారించొచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

# గ్రామాల్లో అమృత్ ఫలాలు..!

రాజపేట : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు మిషన్ అమృత సరోవర్ పథకం కింద చేపట్టిన చెరువుల పూడికతీత పనులు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని 14 మండలాల్లో 76 చెరువులను ఎంపిక చేశారు. ఇందులో 42 చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయగా, మిగిలిన 34 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో పథకం తీరుతెన్నుల విషయమై వివరాలు క్లుప్తంగా..

పద్నాలుగు మండలాల పరిధిలో..

పథకంలో భాగంగా కొత్తగా నీటి కుంటలను తవ్వి నీటి వనరులను నిల్వ చేయాల్సి ఉంది. కుంటల నిర్మాణానికి స్థలాలు అనువుగా లేకుంటే, ఇప్పటికే ఉన్న కుంటలను, చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పథకంలో వీలు కల్పించారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేసి జిల్లాలోని 14 మండలాల్లో 76 చోట్ల నీటికుంటలు,




చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ దిశగానే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం చెరువులను ఎంపిక చేసి పనులను చేపట్టారు. ఈ పథకం పనుల వల్ల ఉపాధి కూలీలకు అదనంగా పని దొరికే అవకాశం ఏర్పడింది.

జలమట్టం పెంపునకు దోహదం: నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, యాదాద్రి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో మొత్తం 76 పనులను ఎంపిక చేశాం. అందులో సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ పథకం కింద చేపట్టే చెరువుల పూడికతీత పనులతో కూలీలకు ఉపాధి లభించడంతోపాటు భూగర్భ జలమట్టం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది.

# పట్టు పెరుగుతోంది



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో సాగు అనుబంధంగా పట్టుపురుగుల పెంపకం ఏటికేడు విస్తరిస్తోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీసాగు నాలుగు జిల్లాల్లో దాదాపుగా 279 ఎకరాలకు విస్తరించగా మరో 90 మంది వరకు నూతనంగా పట్టుపురుగుల పెంపకానికి దరఖాస్తు చేయటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది.దిగుబడి మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. చీడపీడల బెడద ఉండదు. పట్టుసాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ ఇదివరకు సాగుచేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 6-8 పంటలవరకు కాపు తీసుకున్నారు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుండగా కిలోకు కుకూన్ ధర రూ.550-670 వరకుంది. హైదరాబాద్, జనగాంలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. 25-35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులుపోనూ ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పట్టు పురుగులపై ఆశించే తెగుళ్లను సమర్థంగా నిరోధించటం, పట్టుగూళ్లు అల్లుకునే దశల్లో ఇంటిల్లిపాది శ్రమించటంవల్ల రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ మొక్కలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తున్నారు. సాధారణ రైతులకు 2 ఎకరాల్లో సాగుకు 60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.78 వేలు ఇస్తున్నారు. పట్టుపురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.5-6.5 లక్షలు ఖర్చవుతుండగా జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.95 లక్షలను రాయితీగా ఇస్తున్నారు. షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్స్‌కు రూ.17 వేలు, నేత్రికలు, ట్రేలు, ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2,500 నుంచి రూ.3,250 చొప్పున నిధులను ఇస్తున్నారు. గతంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చిన ఇన్సెంటివ్ మొత్తాన్ని పెంచి కొనసాగించాల్సి ఉంది. ఉద్యానశాఖద్వారా, పొలాసలోని వ్యవసాయ కళాశాలలోనూ పట్టుపురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

ఏడాది పొడవునా ఆదాయం

పట్టుపురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నికరాదాయం పొందవచ్చు. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం 1.20 క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తాయి. ప్రభుత్వం పట్టుగూళ్లకు ఇన్సెంటివ్‌ను పెంచి ఇచ్చినట్లయితే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది.నేరెళ్ల చంద్రమౌళి, రైతు, కల్లెడ, జగిత్యాల మండలం

# ఆదాయం సరే.. సౌకర్యాలేవీ?




కరీంనగర్ : టీజీఎస్ ఆర్టీసీ ఒకవైపు ప్రజా రవాణాను కొనసాగిస్తూనే మరోవైపు ఆదాయం పెంచుకోవడంలో భాగంగా లాజిస్టిక్ (పార్సిల్ బుకింగ్) సేవల్లోకి అడుగు పెట్టింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా నిత్యం వేలాది పార్సిళ్లు బుక్ కావడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు పార్సిళ్లు బస్సుల ద్వారా వస్తుంటాయి. వీటి ద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బుకింగ్ కేంద్రానికి రోజు రూ.లక్షకుపైగా ఆదాయం వస్తుంది కానీ.. సరైన సౌకర్యాలు లేక వినియోగదారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నిత్యం 900ల పార్సిళ్లు..

కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ బుకింగ్ కేంద్రానికి మంచి ఆదరణ లభిస్తోంది. బుకింగ్ చేసిన పార్సిళ్లు, కవర్లు రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల నుంచి 48 గంటల్లో చేరే అవకాశం ఉండటంతో వ్యాపారులు, ఇతరులు ఆర్టీసీ బుకింగ్ కేంద్రాల ద్వారానే తమ పార్సిళ్లను పంపిస్తున్నారు. దీంతో సంస్థకు ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ ప్రయాణ ప్రాంగణంలో మూడు కౌంటర్లు 24 గంటలు పనిచేస్తాయి. నిత్యం 900ల పార్సిళ్లు బుక్ చేయడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి 900ల పార్సిళ్లు ఇక్కడకు వస్తుంటాయి.

గమ్యం చేరుకోవడంలో ఆలస్యం

వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్సిళ్లు సకాలంలో వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేబీఎస్‌లో ఉదయం బుక్ చేసిన పార్సిల్ రావడానికి ఒక్కోసారి రెండు రోజులు పడుతుందని ఓ వినియోగదారుడు తెలిపారు. సరైన పర్యవేక్షణ కూడా లేదనే ఆరోపణలున్నాయి. బుకింగ్ కేంద్రానికి వచ్చే పార్సిళ్ల సంఖ్య పెరిగిపోవడంతో వాటిని భద్రపరచడానికి స్థలం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని తీసుకోవడానికి వచ్చిన వారికి అవి ఎక్కడ ఉన్నాయో వెతికి ఇవ్వడం సిబ్బందికి కష్టంగా మారింది. సమస్యలపై లాజిస్టిక్ మేనేజర్ రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. సెక్యూరిటీ సిబ్బంది కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. స్థలం కొరత ఉందని.. సమస్యను ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

బుకింగ్ కేంద్రాలు 3

ఆదాయం రూ.1.50 లక్షలు

ఒకరోజు వచ్చే పార్సిళ్లు 900

బుకింగ్ అవుతున్నవి 900

పని చేస్తున్న సిబ్బంది 26 మంది

ప్రధాన సమస్యలివి..

మూడు బుకింగ్ కేంద్రాల నిర్వహణలో భాగంగా పార్సిళ్లను స్వీకరించడం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాటిని భద్రపరచ్చడం, వినియోగదారులకు అందించడం వంటి పనుల కోసం ఆర్టీసీ ఉద్యోగులు 13, పొరుగు సేవల సిబ్బంది 13 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

24 గంటలు సేవలు అందించే కౌంటర్లు కావడంతో సిబ్బంది సరిపోవడం లేదు.


పనిభారం పెరిగి ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని.. సిబ్బందిని కేటాయించమని కోరినా.. సెలవులు అడిగినా ఇవ్వని పరిస్థితి ఉందని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు పార్సిళ్లను తీసుకోవడానికి నిత్యం వందలాది మంది లాజిస్టిక్ కేంద్రానికి వస్తుండగా.. అక్కడ వస్తువుల రక్షణ చర్యలు అంతగా లేవు.

సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో కేంద్రం లోపలకు ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే కొన్ని పార్సిళ్లు పోయిన ఘటనలు కూడా జరిగాయి.

సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతోపాటు కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# ఆరోగ్య బీమాతో ధీమాగా..!



గోదావరిఖని: ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో చాలామంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు ఆస్పత్రుల ఖర్చు భారం పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కరోనా సమయంలో వైద్య చికిత్సకు రూ.లక్షల్లో బిల్లులు అవడంతో అవగాహన పెరిగి జనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. దీంతో ఆ కంపెనీల వ్యాపారం పెరుగుతుండగా.. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పాలసీదారులకు ఉపయుక్తంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 942 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో ఇన్ పేషంట్లుగా చేరుతున్న వారిలో 30 శాతం వరకు ఆరోగ్య బీమా పాలసీల ద్వారానే వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులైతే శాఖాపరంగా వచ్చే బీమా సౌకర్యంతో, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల వారు తాము చేసుకున్న పాలసీలతో వైద్యం పొందుతున్నారు.

గతంలో ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మధ్య తరగతి వారు చాలామంది ఆరోగ్య బీమా చేయించుకుని అత్యవసర సమయంలో ఖర్చుల భారం లేకుండా చేసుకుంటున్నారు.నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 శాతం మంది వీటి పరిధిలోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు ఆయా శాఖల ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతున్నారు. ఈ కుటుంబాలు లక్ష వరకు ఉంటాయి. ఇక ఏ అవకాశం లేని కుటుంబాల్లో మరో 30 శాతం మంది ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయించుకుని వైద్య సేవలు పొందుతున్నారు.గోదావరిఖనికి చెందిన ఏడాది చిన్నారికి తండ్రి వైద్య బీమా చేయించారు. కొద్ది రోజులకే ఆ చిన్నారికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్లు తగ్గాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళారు. సమయానికి అందిన వైద్యంతో సురక్షితంగా ఇంటికి చేరుకుంది. చికిత్స ఖర్చు రూ.2 లక్షలు. ఆరోగ్య బీమా ఉండటంతో రూపాయి భారం పడకుండా ఆస్పత్రి బిల్లులు చెల్లించారు.ఉమ్మడి జిల్లాలో రూ.5 లక్షల పరిమితి వరకు పాలసీలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. 3 లక్షల కుటుంబాలకు ప్రైవేటు బీమా పాలసీలు ఉండగా అందులో దాదాపు రెండు లక్షల కుటుంబాలు రూ.5 లక్షల పరిమితి పాలసీ తీసుకున్నాయి.

ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే డబ్బు కోసం ఇతరులపై ఆధారపడకుండా వెంటనే ఆస్పత్రుల్లో చేరేందుకు బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు (సుమారు)

జనాభా : 40 లక్షలు

కుటుంబాలు : 10 లక్షలు

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వచ్చే కుటుంబాలు : 3 లక్షలుప్రైవేటు సంస్థల ఆరోగ్య బీమా తీసుకున్న కుటుంబాలు : 3 లక్షలుఅత్యవసర పరిస్థితుల్లో అండగా..

వైద్య సేవలు పొందేందుకు ఆరోగ్య బీమా చేయించుకోవాలన్న అవగాహన పెరిగింది. ఇటీవల వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఆరోగ్య బీమా కార్డు ద్వారానే సేవలు పొందుతున్నారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రోగుల కుటుంబాలకు డబ్బు గురించి హైరానా పడాల్సిన పరిస్థితి తప్పింది. పలు కారణాలతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కొంత ధీమా కల్పిస్తోంది.

# షెడ్యూల్ వచ్చేసింది!

మిర్యాలగూడ: వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండడంతో.. తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో '- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో ఎన్నికల అధికారులు ప్రకటనలు జారీ చేయనున్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం సూచించింది.

ఇదీ షెడ్యూల్..

వరంగల్- ఖమ్మం-నల్గొం డ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండగా.. నవంబరు 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి.. అదే నెల 30న ఓటరు



తుది జాబితా విడుదల చేయనున్నారు.

గత ఎన్నికల్లో 7,243 మంది ఓటర్లు..


గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,243 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,737 మంది, మహిళలు 2,505 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

నల్గొండ పట్టణంలో అత్యధికంగా 1,667 మంది ఓటర్లు ఉండగా.. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 466 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అన్ని మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

# చిగురిస్తున్న ఆశలు

మధిర : ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల గ్రామ సమీపంలోని సర్వే నంబరు 372లోని 58 ఎకరాల స్థలాన్ని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. తద్వారా ఇక్కడ పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. అప్పట్లో కేటాయించినా.. రేమిడిచర్ల సమీపంలోని 58 ఎకరాల గ్రామకంఠం భూమిని పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుకు సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టివిక్రమార్క చొరవతో కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని నిరుద్యోగులు ఎదురుచూసినా దాదాపు పదేళ్లు కార్యరూపం దాల్చలేదు. నిరుద్యోగులు




ఏపీలోని కృష్ణా జిల్లాలోని పారిశ్రామికవాడల్లో రోజువారీ కూలీలుగా వలస వెళుతున్నారు. పారిశ్రామిక పార్కుకు కేటాయించిన భూమి.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని వాణిజ్య నగరం విజయవాడకు కేవలం 40 కి.మీ. దూరంలోనే రహదారి, రైల్వేట్రాక్ పక్కనే ఉండటం గమనార్హం.పది సంవత్సరాల అనంతరం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ రావడంతో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. ఆ భూమిని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ మంత్రివర్గం ఇటీవల తీర్మానించింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటవుతుందని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులు, రైతు కూలీలకు ఆసరాగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడు తున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. జులై నెలలో డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ఏవియేషన్ అధికారుల బృందం వచ్చి ఈ భూములను పరిశీలించి వెళ్లింది.

# రూ.251 కోట్లు వృథా

హైదరాబాద్: డంపింగ్‌యార్డు నిర్లక్ష్యంతో రూ.251 కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. మల్కారం చెరువు శుద్ధి పనులను ఇటీవలే జీహెచ్‌ఎంసీ పూర్తి చేసింది. మూడేళ్లు శ్రమించి మురుగు మొత్తాన్ని శుద్ధి చేసిందని అనుకునేలోపే డంపింగ్‌యార్డు వల్ల చెరువు మళ్లీ కాలుష్య జలాలతో నిండిపోయింది. వద్దంటున్నా వినకుండా తటాకం పక్కనున్న స్థలంలో లక్ష టన్నులకుపైగా చెత్తను కుప్పగా పోయడంతో ఇటీవలి వర్షాలకు వ్యర్థాల నుంచి వెలువడిన వరద నీరంతా చెరువును ముంచెత్తింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009లో శామీర్‌పేట మండలం, జవహర్‌నగర్ గ్రామంలో 338 ఎకరాలను కేటాయించింది. అప్పట్నుంచి నగరంలో ఉత్పత్తయ్యే చెత్త అంతా అక్కడికే తరలుతోంది. 2012లో రాంకీ సంస్థ నిర్వహణ పనులు చేపట్టింది. చెత్త కుప్పల మురుగును శుద్ధి చేయకుండా వదిలేయడం వల్ల పక్కనున్న మల్కారం చెరువు కలుషితమైందని స్థానికులు వాపోయారు. అయినప్పటికీ అధికారులు రాంకీ సంస్థ యాజమాన్యానికి సంబంధించిన మరో సంస్థకు చెరువు శుద్ధి పనులను అప్పగించారు. 3 నెలల క్రితం పని పూర్తయినట్లు వెల్లడించారు. అంతలోనే చెరువు మళ్లీ మురుగుతో నిండిపోయింది. రోజువారీ వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం కొరవడిందని, చెరువు పక్కనున్న ఖాళీ స్థలంలో నిల్వ చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.




# ఇండో-యూఎస్ సంబంధాలు మరింత బలోపేతమవ్వాలి

అమరావతి: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. తమ దేశాన్ని ముందుకు నడిపించే ప్రక్రియలో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

ట్రంప్ మొదటి పదవీ కాలంలో ఇండో-యూఎస్ సంబంధాలు గణనీయంగా బలోపేతమయ్యాయని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రధాని మోదీ, ట్రంప్ నాయకత్వంలో రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. రెండు దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందింప జేసుకుంటాయని విశ్వసిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

**బాలకృష్ణ శుభాకాంక్షలు :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అన్‌స్టాపబుల్ విజయం అందుకున్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఎమ్మెల్యే బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొన్న వారందర్నీ బాలకృష్ణ అభినందించారు.



# ఏపీ డ్రోన్ పాలసీకి ఆమోదం

## సీఆర్‌డీఏ పరిధి పెంపు

## డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాలు


## 25వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ

## జ్యుడిషియల్ అధికారుల ఉద్యోగవిరమణ వయసు పెంపు

అమరావతి: ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ జీఎస్టీ 2024 చట్ట సవరణ, 2014-18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం చెప్పింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ పాలసీ తీసుకొచ్చారు. డ్రోన్ రంగంలో 40 వేల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. డ్రోన్ రంగంలో పరిశోధన చేసే విద్యా సంస్థలకు రూ.20 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ఏపీ కేబినెట్ నిర్ణయించిందన్నారు. ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్, డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లును అభివృద్ధి చేయబోతున్నట్లు వెల్లడించారు. 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ, టెస్టింగ్, ఆర్‌అండ్‌డీ ఫెసిలిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. 25 వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇస్తామన్నారు. 50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు.

**మరిన్ని క్యాబినెట్ నిర్ణయాలు :** ఎక్సైజ్ చట్ట సవరణ ముసాయిదాకు, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యాల సాధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం. సీఆర్డీఏ పరిధిని 8,352 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ఆమోదం. సీఆర్డీఏ పరిధిలోకి పల్నాడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి 154 గ్రామాలు.

11 మండలాల్లోని 154 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి తెస్తూ ఆమోదం. జ్యుడిషియల్ అధికారుల ఉద్యోగ విరమణ వయసు 61కి పెంచుతూ ఆమోదం. 2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా చట్ట సవరణ బిల్లుకు ఆమోదం.



# గ్లోబల్ డ్రోన్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్

అమరావతి: డ్రోన్ రంగంలో రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులు, వందకుపైగా డ్రోన్ పరిశ్రమల స్థాపన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ సంస్థ ఏపీ డ్రోన్ పాలసీ 4.0ను రూపొందించింది. రూ.3వేల కోట్ల ఆదాయ సముపార్జనతోపాటు ఏపీని గ్లోబల్ డ్రోన్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడమే దీని ప్రధాన లక్ష్యం. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్‌లు నిపుణులతో సుదీర్ఘ కసరత్తు చేసి ఈ డ్రోన్ పాలసీని రూపొందించారు. డ్రోన్ తయారీ, సేవల రంగం ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందే రంగంగా ఏపీ ప్రభుత్వం గుర్తించింది. ఇందులో భాగంగా ఈ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ఈ రంగంలో దేశానికే తలమానికంగా ఏపీని అభివృద్ధి చేయాలని, ప్రపంచ దేశాలు సైతం డ్రోన్ తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగంలో ఏపీవైపు చూడాలనే ప్రధాన లక్ష్యాలతో ఈ పాలసీని రూపొందించారు.

**భారీ ప్రోత్సాహకాలు :** డ్రోన్ తయారీ రంగంలో రాష్టంలో రూ.వెయ్యి కోట్లకుపైగా పెట్టుబడులు సాధించాలని ఈ పాలసీని రూపొందించారు. పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే సంస్థలకు వారి మూలధన పెట్టుబడిపైన రూ.5 కోట్లకు మించకుండా.. 20 శాతం రాయితీ కల్పించే విధంగా రూపొందించారు. డ్రోన్ తయారీ, సేవల రంగంలో రూ.3 వేల కోట్లకుపైగా రాబడి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**విద్యుత్తు వినియోగంలోనూ రాయితీ :** డ్రోన్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విద్యుత్ వినియోగంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రాయితీని కల్పించనుంది. యూనిట్ విద్యుత్తు ధరలో రూ.1 రాయితీ రూపంలో సంవత్సరానికి రూ.1 లక్షకు మించకుండా ప్రభుత్వం రెండేళ్లపాటు ప్రోత్సాహకం ఇస్తుంది. దీంతోపాటు వంద శాతం ఎస్‌జీఎస్టీ నుంచి మినహాయింపు, భూ బదలాయింపులో స్టాంపు డ్యూటీ పూర్తి మినహాయింపుతోపాటు లీజు ధరల్లో 50శాతం రాయితీ కల్పించనున్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులివ్వనున్నారు.

**డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు :** కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా తయారు చేయనున్నారు. 300 ఎకరాల్లో ఇక్కడ డ్రోన్ తయారీ పరిశ్రమలు నెలకొల్పనున్నారు. రాష్ట్రంలో 25 వేల మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో 20 రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సంస్థల ద్వారా శిక్షణ పొందేవారికి రూ.2 వేల ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. డ్రోన్ల రంగంలో 15 వేల మంది ప్రత్యక్షంగా, 25 వేల మంది పరోక్షంగా ఉపాధి పొందేలా చర్యలు చేపట్టనున్నారు. అంతేకాకుండా డ్రోన్ పరిశోధనలు చేపట్టే విద్యా సంస్థలకు రూ.20 లక్షల పరిశోధన గ్రాంట్‌ను ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

డ్రోన్ సేవలతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఈ పాలసీని రూపొందించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాలు ప్రజలకు మరింత సులభంగా సేవలను అందజేయడానికి వీలుగా డ్రోన్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకోసం ప్రతిశాఖలోనూ ప్రత్యేకించి ఓ డ్రోన్ ఇన్నోవేషన్ అధికారిని నియమించనున్నారు.

# మూడు హత్యల కేసులో నిందితుల అరెస్టు



కాజులూరు: కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో మూడు హత్యల కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు వెల్లడించిన వివరాల ప్రకారం.. "శెలపాకలో గత నెల 31న రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. చిన్నయ్య, రమేష్, రాజు అనే వ్యక్తులను పొట్లకాయ నాగేశ్వరరావు, అతని కుటుంబం అతి కిరాతకంగా హత్య చేశారు. ఇనుప రాడ్లు, మంచం కోళ్లతో దాడి చేశారు. కాపాడటానికి వెళ్లిన బాధిత కుటుంబ సభ్యుడు శ్రీనుపైనా దాడి చేయగా. అతడు తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నాడు" అని డీఎస్పీ తెలిపారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఓ మహిళపై కామెంట్ చేయడమే హత్యలకు కారణమని తెలిపారు.



# సెకండ్ లేడీగా తెలుగమ్మాయి!

అమెరికాకు 47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టనున్నారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ వ్యవహరించనున్నారు. అంటే ఆంధ్రా అల్లుడు అగ్రరాజ్యానికి ఉపాధ్యక్షుడు కానున్నరన్నమాట. ఆయన భార్య ఉష తెలుగమ్మాయి కావడం ఇందుకు నేపథ్యం. ఆమె అమెరికాకు సెకండ్ లేడీగా వ్యవహరించబోతున్నారన్నమాట. ఒహాయో రాష్ట్ర సెనేటర్‌గా జేడీ వాన్స్‌ను ఉపాధ్య అభ్యర్థిగా ట్రంప్ ఎంపిక చేసుకున్నప్పటి నుంచే ఉష పేరు మార్మోగింది. ఎన్నికల్లో రిపబ్లికన్ల విజయం వేళ ఆమె పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వికులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. తల్లి లక్ష్మి మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ రంగ నిపుణురాలు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే, శాన్‌డియాగో విశ్వవిద్యాలయంలో కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ పదవిలో ఉన్నారు. తండ్రి రాధాకృష్ణ.. క్రిష్ చిలుకూరిగా అందరికీ పరిచయం. ఆయన ఏరోస్పేస్ ఇంజినీర్. యునైటెడ్ టెక్నాలజీస్ ఏరోస్పేస్ సిస్టమ్స్ ఏరోడైనమిక్స్ స్పెషలిస్ట్‌గా పనిచేశారు. ఆపై కాలిన్స్ ఏరోస్పేస్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో ఉషా చిలుకూరి పుట్టి పెరిగారు. యేల్ యూనివర్సిటీ నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యాయ సంబంధమైన విభాగాల్లో సుదీర్ఘంగా పనిచేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జాన్ రాబర్ట్స్, జస్టిస్ బ్రెట్ కెవానా వద్ద విధులు నిర్వర్తించారు. పటిష్ఠమైన విద్యా నేపథ్యమున్న ఆమె.. యేల్ విశ్వవిద్యాలయంలో లా అండ్ టెక్ జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా, యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. నాలుగేళ్ల పాటు అదే విశ్వవిద్యాలయంలో ఆమె అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం కేంబ్రిడ్జి యూనివర్సిటీకి గేట్స్ ఫెలోగా వెళ్లారు. అక్కడ ఆమె లెఫ్ట్-వింగ్, లిబరల్ గ్రూప్స్‌తో కలిసి పనిచేశారు.

# పున్నమి ఘాట్ వద్ద ఘనంగా శక్తి విజయోత్సవం



దసరా ఉత్సవాల సందర్భంగా పున్నమి ఘాట్ వద్ద ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శక్తి విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మికత, సాధికారత మేళవింపుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విజయదశమిని జరుపుకోవడానికి 25 వేల మందికి పైగా ప్రజలు మూడు రోజుల పాటు ఒక చోట చేరడం విశేషం. మహిళల్లోని బలం, ధైర్యాన్ని సూచించేలా శక్తి విజయోత్సవం నిర్వహించారు. నదీ తీరంలో సూర్యుడు అస్తమిస్తుండగా.. ఘాట్‌లు మరింత అద్భుతంగా కనిపించాయి. శంఖనాదాలు, పవిత్ర మంత్రోచ్చారణల నడుమ మహా హారతి కార్యక్రమం జరిగింది. దుర్గా మాత నవ అవతారాలను సూచించే విధంగా తొమ్మిది మెగాబోట్లు కృష్ణా నదిలో ప్రయాణిస్తూ మరింత శోభను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా 300 మందికి పైగా మహిళా కళాకారులు, ప్రదర్శనకారులు అనేక నృత్య రూపకాలు.. ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్‌పర్సన్.. NTR మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిబీ హోం శాఖ మంత్రి వి.అనితబీ మహిళా శిశు - గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిబీ పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. మహిషాసుర మర్దిని పురాణంలోని.. అంధకారంపై దుర్గామాత సాధించిన విజయాన్ని కూచిపూడి నృత్యరూపకంగా ప్రదర్శించారు. దేవత తొమ్మిది రూపాల కథలను సంగీతం రూపంలో వివరించారు. ఆకాశాన్ని దీపాలమయం చేస్తూ డ్రోన్లతో నిర్వహించిన షో మధురానుభూతిని అందించింది. స్థానిక జానపద కథల నుంచి ప్రేరణ పొంది.. నేటి అధునాతన సాంకేతికతో రూపొందించిన కథలు ఆకట్టుకున్నాయి. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన మహిళలను ఏకం చేయడం, వారి మధ్య బంధాన్ని పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు గొప్ప పాత్రను పోషిస్తాయని అతిథులు వ్యాఖ్యానించారు. కనులపండువగా జరిగిన ఈ కార్యక్రమాన్ని '%జు% ఫ్యాక్టర్ ఎక్స్‌పీరియెన్సెస్ లిమిటెడ్' గొప్పగా నిర్వహించింది.



# తితిదే ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం

తిరుమల: తితిదే ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో బీఆర్ నాయుడు, 16 మంది పాలక మండలి సభ్యులతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం శ్రీవారిని బీఆర్ నాయుడు దర్శించుకున్నారు. తొలుత తితిదే ఛైర్మన్‌కు ఆలయ మహాద్వారం వద్ద అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం లోపలికి వెళ్లిన ఆయన.. భూవరాహ స్వామివారిని దర్శించుకున్నారు.

# నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదాం: చంద్రబాబు





అమరావతి: నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదామని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత రాజకీయ అంశాలపై అమాత్యులతో చంద్రబాబు చర్చించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రభుత్వాన్ని కించపరిచే పోస్టులపై ఉదాసీనత తగదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిగా ప్రస్తావించినట్లు తెలిసింది. అసభ్య, అవాస్తవ పోస్టులపై ఫిర్యాదులు వస్తున్నా, కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ అన్నట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో క్రియాశీలంగా వ్యవహరించిన కొందరు అధికారులే ఇప్పుడు కీలక పదవుల్లో ఉన్నారనే అంశం చర్చకు వచ్చింది. కొంతమంది అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పలు జిల్లాల ఎస్పీలు మంత్రుల ఫోన్లకు సరిగా స్పందించడం లేదని తెలిసింది. కింది స్థాయిలో డీఎస్పీ, సీఐలపై నెపం నెట్టి.. తప్పించుకుంటున్నారని మంత్రులు చంద్రబాబుకు తెలిపారు. ఈ సమయంలో కలగజేసుకున్న పవన్ కల్యాణ్.. తానూ అందుకే తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం నుంచే పోలీసులు ఇలా తయారయ్యారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ నెల రోజుల్లో వ్యవస్థను గాడిన పెడదామని సీఎం స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య పోస్టులను ఇకపై ఉపేక్షించేది లేదన్నారు.

# వర్రా రవీంద్రారెడ్డిని వదిలేసిన పోలీసులు.. సీఎం, డీజీపీ ఆగ్రహం



కడప: వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు వదిలేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. కడప తాలూకా పోలీసులు బుధవారం తెల్లవారుజామున రవీంద్రారెడ్డికి 41-ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కడపలోని ఎస్పీ కార్యాలయానికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేరుకుని ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో సమావేశమయ్యారు. వర్రా రవీంద్రారెడ్డి కేసుపై ఆయన ఆరా తీశారు. వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో పలు కేసులున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పులివెందులలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కడపకు తీసుకొచ్చి రహస్యంగా విచారించారు. అనంతరం బుధవారం 41-ఏ నోటీసు ఇచ్చి పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలంటూ వదిలిపెట్టారు. మరో కేసులో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు మళ్లీ వెళ్లగా వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారు. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. రవీంద్ర ఆచూకీ కోసం బుధవారం కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకుని చింతకొమ్మదిన్నె పీఎస్‌లో విచారిస్తున్నారు.

# నెమలి చీరలో అనసూయ హొయలు

తెలుగు చిత్రపరిశ్రమలో తన ప్రత్యేకమైన స్టైల్, అందంతో తనకంటూ ఓ ఫ్యాన్ బేస్ ను సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్, ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో తన సరికొత్త శారీ లుక్ తో కవ్వించిపోతుంది. ఇటీవల పర్పుల్ బేస్ కలర్ శారీలో తీసుకున్న ఫోటోలను షేర్ చేస్తూ, సాంప్రదాయ లుక్ లో తన అందాన్ని మరింత బాగా హైలైట్ చేసింది. ఆమె పెదవులపై చిరునవ్వు, వినూత్నమైన బ్లౌజ్ డిజైన్ తో ముద్దుగుమ్మ అందరి మనసులు దోచేస్తోంది. అనసూయ ఈ ఫోటోలకు మంచి వింటేజ్ లుక్ ఇచ్చి స్టైలిష్ గా కనిపించారు. ఆమె జ్యూవెలరీ చాయిస్ కూడా ఈ లుక్ ను మరింత మెరుగు పరచింది. బంగారు, వెండి కలర్ కలిపి ఉన్న ఈ శారీలో అనసూయ నెటిజన్లను ఆశ్చర్యపరుస్తూ, సాంప్రదాయానికి మోడ్రన్ టచ్ ను కలిపి తనకే ఉన్న ప్రత్యేకతను చాటిచెప్పారు. మేకప్ సింపుల్ గా ఉండగా, హెయిర్ స్టైల్ కూడా



ఆమె శైలిని మరింత మెరుగుపరిచింది. ఈ ఫోటోలను పోస్ట్ చేస్తూ అనసూయ తన అభిమానులకు ప్రత్యేక సందేశం ఇచ్చింది. నెమలి లాంటి అందం అంటూ ఏమోజీలతో తన జీవన విధానాన్ని పంచుకున్నారు. ఆమె ఇచ్చిన ఈ క్యాప్షన్ అభిమానులను ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. మహిళలు కేవలం అందంతో కాకుండా, ధైర్యసాహసాలతోనూ ముందుకు సాగాలి చాలాసార్లు ఆమె తన ఆలోచన విధానం తో స్ఫూర్తి నింపారు. ఈ కొత్త లుక్ తో అనసూయ మరోసారి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. అనసూయ ఎక్కడ ఉన్నా, ఏం చేసినా దానిని ప్రత్యేకంగా తీర్చిదిద్దుకుంటూ, తనలోని గ్లామర్ తో పాటు, ఆమెలోని తెలివితేటలతో ఆకట్టుకుంటుంది. ఇక ప్రస్తుతం అనసూయ పలు క్రేజీ ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పుష్ప 2లో ఆమె ఈసారి మరింత పవర్ఫుల్ గా కనిపించబోతోంది.

# సాయి పల్లవి.. ఆ సినిమాకి పెద్ద సవాల్

పవిత్ర ఇతిహాసం రామాయణం ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ రామాయణ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ మూవీ లవర్స్ ను ఎంతో ఊరిస్తున్న ఆ ప్రాజెక్ట్ లో రాముడిగా బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్, సీతగా హీరోయిన్ సాయి పల్లవి నటిస్తున్నారు. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్ యాక్ట్ చేస్తున్నారు. అదే సమయంలో మూవీ ప్రొడక్షన్ లో కూడా ఆయన భాగమయ్యారు. సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సన్నీ డియోల్, రకుల్, లారా దత్తా వంటి ప్రముఖ నటీనటులు సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం మూవీ షూటింగ్ స్టార్ అవ్వగా.. ఆ మధ్య కొన్ని పిక్స్ లీక్ అయ్యాయి. అందులో రణబీర్, సాయి పల్లవి తమ తమ పాత్రల్లో కనిపించారు. మూవీ షూటింగ్ మొదలైన కొద్దిరోజుల్లోనే ఫోటోస్ లీక్ కావడంతో మేకర్స్.. ఇప్పుడు ముంబైలో ఇండోర్ షూటింగ్ చేస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. అదే సమయంలో ఇప్పుడు రామాయణ్ మేకర్స్.. సినిమా తెరకెక్కించే విధానంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన



అవసరం ఉందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. హిందూ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యేలా చూడాలని చెబుతున్నారు. ఎక్కడా ఏదీ మిస్ ఫైర్ అవ్వకుండా సినిమా తీయాలని సూచిస్తున్నారు. లేకుంటే పెద్ద సవాల్ ఎదుర్కోవాల్సి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అందుకు ఉదాహరణలు కూడా చెబుతున్నారు. రామాయణం ఆధారంగా అనేక సినిమాలు ఇప్పటికే తెరకెక్కిన విషయం తెలిసిందే. అందులో 2010లో మణిరత్నం తీసిన రావణ్ మూవీ అనుకున్న స్థాయిలో ఆకట్టుకోలేదు. గత ఏడాది పాన్ ఇండియా ప్రభాస్ నటించిన ఆదిపురుష్ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి డిజాస్టర్ గా మారింది. దారుణంగా విమర్శలు, ట్రోల్స్ ఎదుర్కొంది. రోల్స్ గెటప్స్ తో పాటు వీఎఫ్ ఎక్స్ విషయంలో వేరే లెవెల్ లో మేకర్స్ ను ట్రోల్స్ చేశారు నెటిజన్లు రీసెంట్ గా దీపావళికి వచ్చిన సింగం అగైన్ మూవీ కూడా రామాయణం బ్యాక్ డ్రాప్ తోనే తెరకెక్కింది. డైరెక్టర్ రోహిత్ శెట్టి ఐడియా బాగున్నా.. ఆడియన్స్ ను పెద్ద ఎక్కలేదని చెప్పాలి. దీంతో రామాయణం ఆధారంగా వచ్చిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతుండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని, బాగా కష్టపడాలని రామాయణ్ మేకర్స్ కు నెటిజన్లు సోషల్ మీడియాలో సజ్జెస్ట్ చేస్తున్నారు. మరి ఆ సినిమా ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో వేచి చూడాలి.




# త్రిషకు సమంత ఎంత మంచి ఫ్రెండో తెలుసా?





పరిశ్రమలో కొన్ని స్నేహాలు ఎగ్జయిట్ చేస్తాయి. పది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయి. అలాంటి ఒక అందమైన స్నేహం గురించి ముచ్చటించుకోవాల్సిన తరుణమిది. సౌత్ అగ్ర కథానాయికలు త్రిష కృష్ణన్ – సమంత రూత్ ప్రభు మధ్య సాన్నిహిత్యం, విడదీయరాని అనుబంధం గురించి ఈ సంఘటన బహిర్గతం చేసింది. ఇటీవల న్యూయార్క్ టైమ్స్ క్రాస్‌వర్డ్ పజిల్‌లో తన పేరు కనిపించినప్పుడు త్రిష కృష్ణన్ ఆశ్చర్యపోయింది. ఉత్సాహంగా ఈ సంగతిని సోషల్ మీడియాల ద్వారా ఫ్యాన్స్ కు వెల్లడించింది. తన ఇన్‌స్టాలో పజిల్ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేసింది. తద్వారా దీనికి త్రిష ఎంత థ్రిల్ అయిందో అందరికీ అర్థమైంది. ఈ వార్తలపై సమంత రూత్ ప్రభు కూడా స్పందించారు. ఎగ్జయిట్ అయిన త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ లో ఒక అభిమాని చేసిన ట్వీట్‌ను పోస్ట్ చేసింది. "న్యూయార్క్‌టైమ్స్ క్రాస్‌వర్డ్ క్రాస్‌వర్డ్ క్లూలలో ఒకటిగా 'దక్షిణ భారత నటి'ని కలిగి ఉంది!" అని రాస్తూ.. ఆ పోస్ట్‌లో బాక్స్‌లలో నింపిన త్రిష పేరు స్క్రీన్‌షాట్ ఉంది. దానికి త్రిష స్పందిస్తూ హార్ట్ ఎమోజితో "నేను ఈరోజు న్యూయార్క్‌కి వచ్చాను" అని రాసింది. మరొక పోస్ట్‌లో ఇలా పేర్కొంది. "కే బై! ప్రదర్శించడం పూర్తయింది (కోతి ఎమోజి)" అని రాసింది. త్రిష సాధించిన ఈ ఘనతను తెలుసుకుని బెస్ట్ ఫ్రెండ్ సమంత ఆగలేకపోయింది. దాన్ని మళ్లీ షేర్ చేస్తూ "%చీ% క్రాస్‌వర్డ్ ఏత్రిషాకృష్ణన్ క్వీన్ (హార్ట్ ఎమోజి)" అని రాసింది. త్రిష దాన్ని రీపోస్ట్ చేస్తూ "అవువ్ సామ్, యూ ఆల్ హార్ట్ మై గాళ్ (హార్ట్ ఎమోజి)" అని రిప్లై ఇచ్చింది. త్రిష కృష్ణన్– సమంతా రూత్ ప్రభు సినీ పరిశ్రమలో గొప్ప స్నేహితులు. వారు నిరంతరం సోషల్ మీడియాలో ఒకరికొకరు మద్దతు ఇస్తారు. ఒకరి విజయాలను మరొకరు సెలబ్రేట్ చేసుకుంటారు. వారి బంధం బహిరంగ కార్యక్రమాలు, షోలలో స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సందర్భాలలో ఆ ఇరువురి స్నేహాన్ని అభిమానులు ప్రశంసించారు కూడా. త్రిష ఇటీవల విజయ్‌తో కలిసి లియో చిత్రంలో నటించింది. ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్‌లో ప్రత్యేక పాత్రలో కనిపించింది. అజిత్ కుమార్‌తో 'విడాముయార్చి'.. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలను చేసింది. కమల్ హాసన్‌తో థగ్ లైఫ్ .. చిరంజీవితో విశ్వంభర చిత్రాల షూటింగ్‌లను పూర్తి చేసింది. మలయాళంలో ప్రస్తుతం రామ్ అండ్ ఐడెంటిటీ చిత్రంలో చేస్తోంది. సమంతా రూత్ ప్రభు ప్రస్తుతం సిటాడెల్: హనీ బన్నీ లో కనిపించనుంది. ఈనెలలో ఇది స్ట్రీమింగ్ కానుంది. వరుణ్ ధావన్ ,సమంతలతో పాటు ఈ సిరీస్‌లో సికందర్ ఖేర్, కే కే మీనన్, సిమ్రాన్, సాకిబ్ సలీమ్, సోహమ్ మజుందార్, శివన్‌కిత్ పరిహార్, కష్వీ మజుందార్ తదితరులు నటించారు. రాజ్ & DK దర్శకత్వం వహించారు. ఈ స్పై థ్రిల్లర్ D2R ఫిల్మ్స్ –అమెజాన్ MGM స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. మరోవైపు బంగారం అనే సినిమాను సమంత సొంత బ్యానర్ లో నిర్మిస్తోంది.

# దళపతితో 'లియో 2'పై లోకేష్ కనగరాజ్ బిగ్ అప్‌డేట్



భారతదేశంలో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ల జాబితాను తయారు చేస్తే అందులో టాప్ 10లో ఉంటాడు లోకేష్ కనగరాజ్. అంతగా అతడు ఇటీవల కమర్షియల్ బ్లాక్ బస్టర్లతో అందరి దృష్టిని ఆకర్షించాడు. స్క్రీన్ ప్లే మాస్టర్ గా అతడికి ఉన్న గ్రిప్ గొప్ప స్టార్లను సైతం తన కోసం క్యూకట్టేలా చేస్తోంది. అయితే అతడు తెరకెక్కించిన లియో చిత్రంపై తీవ్ర విమర్శలొచ్చాయి. స్క్రీన్ ప్లే అంత బాలేదని కూడా విమర్శించారు. కానీ ఈ సినిమాకి సీక్వెల్ ఉంటుందనే ప్రకటనలు కొన్నాళ్లుగా వైరల్ అవుతున్నాయి. ఇటీవల కవిన్ నటించిన 'బ్లడీ బిచ్చగాడు' చిత్రం స్క్రీనింగ్‌కు హాజరైన లోకేష్ కనగరాజ్‌ను మీడియా వెంబడించింది. దళపతి విజయ్‌తో లియో 2 చేస్తారా? అని కొందరు మీడియా ప్రతినిధులు అడిగారు. ఓ వీడియో ఇంటర్వ్యూలో లోకేష్ మాట్లాడుతూ.. "విజయ్ అన్న మాత్రమే నిర్ణయించగలడు.. అతడు అంగీకరిస్తే నేను కచ్చితంగా లియో 2 చేస్తాను"అని చెప్పాడు.

అదే ఇంటరాక్షన్‌లో దళపతి రాజకీయ పార్టీ %ఃఎఖ% కోసం విజయ్ నిర్వహించిన రాష్ట్ర సదస్సుపై దర్శకుడిని అభిప్రాయాన్ని అడిగారు. లోకేష్ స్పందిస్తూ "దాని గురించి నేను ఏమి చెప్పగలను? విజయ్ సర్‌కి శుభాకాంక్షలు" అని అన్నాడు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన లియో చిత్రానికి సీక్వెల్ తీయాలంటే ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. ఇప్పటికే విజయ్ రాజకీయ ఆరంగేట్రం చేస్తూ చివరి సినిమాల గురించి ప్రకటించేసాడు. కాబట్టి అతడు తిరిగి రాజకీయాలు వదిలేసి వచ్చాకే ఇతర సినిమాల గురించి ఆలోచించగలడు.

**కూలీ గురించి...** రజనీకాంత్ నటించిన కూలీ షూట్ సజావుగా సాగుతోందని, ఇంకా రెండు షెడ్యూల్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయని దర్శకుడు లోకేష్ తాజా ఇంటర్వ్యూలో ధృవీకరించారు. షూటింగ్ పూర్తయిన తర్వాతే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. సూపర్ స్టార్ హై-ఆక్టేన్ యాక్షన్ అవతార్ తో మెప్పిస్తారని టీజర్ ట్రైలర్‌తో అర్థమైంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో రజనీకాంత్ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు.

ఈ చిత్రంలో నాగార్జున అక్కినేని, ఉపేంద్రరావు వంటి ప్రముఖ స్టార్లు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రుతి హాసన్, సౌబిన్ షాహిర్, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నారనే ఊహాగానాలు కూడా ఉన్నాయి.

# సతీ లీలావతిలా మెగా కోడలు

తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎలాంటి అంచనాలు లేకుండానే వచ్చినా.. తనదైన అందం, అభినయంతో ఆకట్టుకున్న హీరోయిన్ లావణ్య త్రిపాఠి. ఆరంభంలోనే మంచి మంచి చిత్రాలు, పాత్రలతో మెప్పించిన ఈ భామ.. వరుసగా ఆఫర్లను దక్కించుకుంది. అప్పటి నుంచి ఏమాత్రం వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగుతోంది. అయితే, ఈ మధ్య కాలంలో లావణ్య వెండితెరపై పెద్దగా కనిపించడం లేదు. టాలీవుడ్ క్యూట్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి గత ఏడాదిలోనే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌ను పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. చాలా కాలం పాటు ఎంతో రహస్యంగా ప్రేమాయణం సాగించిన వీళ్లిద్దరూ.. పెద్దలను ఒప్పించి అగ్నిసాక్షిగా ఏకం అయ్యారు. పెళ్లి తర్వాత కూడా లావణ్య కెరీర్‌ను కంటిన్యూ చేస్తోంది. ఇప్పటికే ఆమె 'పులి మేక', 'మిస్ పర్‌ఫెక్ట్' వంటి వెబ్ సిరీస్‌లతో వచ్చి ప్రేక్షకులను అలరించింది. లావణ్య త్రిపాఠి చాలా ఏళ్ల పాటు ఏకధాటిగా ప్రాజెక్టులు చేసినప్పటికీ.. ఈ మధ్య కాలంలో ఆశించిన రీతిలో సినిమాలు చేయడం లేదు. అడపాదడపా వెబ్ సిరీస్‌లలో కనిపించినా ఆమె అభిమానులు మాత్రం నిరాశ చెందుతూనే ఉన్నారు. ఇలాంటి



పరిస్థితుల్లో లావణ్య త్రిపాఠి కొత్త సినిమాను ఓకే చేసినట్లు తాజాగా ఓ వార్త ఫిలిం నగర్ సర్కిళ్లలో విపరీతంగా వైరల్ అయిపోతోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ భార్యగా మారిన తర్వాత లావణ్య త్రిపాఠి సినిమాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాలని డిసైడ్ అయిపోయింది. ఇందులో భాగంగానే ఆమె ఎక్కువగా లేడీ ఓరియెంటెడ్ స్టోరీలనే వింటున్నట్లు కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి' అనే ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని సమాచారం. లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో రాబోతున్న 'సతీ లీలావతి' సినిమాను ఓ టాలెంటెడ్ డైరెక్టర్ తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. అంతేకాదు, ఇందులో ఆమె భర్తగా టాలీవుడ్‌లోని ఓ ఫేమస్ యంగ్ హీరో నటిస్తున్నాడట. ఈ చిత్రాన్ని పెద్ద నిర్మాణ సంస్థ తీస్తున్నట్లు కూడా తెలిసింది. ఇక, ఈ సినిమా భార్యభర్తల కథాంశంతో రూపుదిద్దుకోబోతుందట. ఇందులో లావణ్య త్రిపాఠి పాత్ర మాత్రం హైలైట్‌గా ఉండనుందనే టాక్ వినిపిస్తోంది. మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన న్యూస్ ఇప్పుడు ఇండస్ట్రీలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇక, ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని యూనిట్ అతి కొద్ది రోజుల్లోనే వెల్లడించనుందట. దీంతో ఇప్పుడు ఈ న్యూస్ హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# ట్రెండీ డ్రెస్‌లో తెలుగు పిల్ల గ్లామర్ డోస్

ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది లోకల్ బ్యూటీలు హీరోయిన్లుగా తమదైన రీతిలో సందడి చేస్తున్నారు. అందులో హైదరాబాదీ చిన్నది శాన్వీ మేఘన ఒకరు. నటన మీద ఉన్న మక్కువతో సీరియల్ నటిగా కెరీర్‌ను మొదలు పెట్టిన ఈ చిన్నదానికి ఆరంభంలోనే అది ఆగిపోవడంతో షాక్ తగిలింది. ఈ పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంతో ఒక చిన్న రోల్ తో సినీ కెరీర్ ను స్టార్ట్ చేసింది. 'సైరా: నరసింహారెడ్డి' తర్వాత శాన్వీ మేఘన 'పిట్ట కథలు' సినిమాలోనూ మెరిసింది. దీని తర్వాత ఈ చిన్నది వరుసగా 'పుష్పక విమానం', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్', 'ప్రేమ విమానం' వంటి చిత్రాలను చేసింది. ఇలా ఈ అమ్మడు వరుసగా మూవీలు చేస్తూ తనదైన రీతిలో ప్రభావాన్ని చూపిస్తూ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే ఇప్పుడు శాన్వీ కొన్ని చిత్రాల్లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేసింది. కొంత కాలంగా తనదైన



చిత్రాలతో టాలీవుడ్‌లో కొంత మార్కును చూపిస్తోన్న శాన్వీ మేఘన.. సినిమాల పరంగా అంతగా గుర్తింపును మాత్రం తెచ్చుకోలేదు. కానీ, సోషల్ మీడియా ద్వారా ఈ చిన్నది మాత్రం మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. అందుకే ఎక్కువగా ఇందులోనే సమయాన్ని గడుపుతూ వస్తోంది. ఇలా ఈ తెలుగు అమ్మాయి ఎంతో మంది అభిమానాన్ని సైతం దక్కించుకుంది. టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శాన్వీ మేఘన సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడమే కాదు.. తరచూ తనకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను కూడా షేర్ చేస్తూనే ఉంటోంది. ఇందులో భాగంగానే ఈ మధ్యన కాస్త డోస్ పెంచేసి మరీ అందాల ప్రదర్శన చేస్తోంది. స్టైలిష్ అండ్ ట్రెండీ డ్రెస్సుల్లో దిమ్మతిరిగే ఫోజులు పెడుతూ హీటెక్కిస్తోంది. దీంతో శాన్వీ మేఘన నిత్యం హాట్ టాపిక్ అవుతోంది. తెలుగు పిల్ల శాన్వీ మేఘన తాజాగా కొన్ని క్రేజీ పిక్స్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. వీటిలో ఈ చిన్నది బ్లూ కలర్ ఫ్యాషన్ డ్రెస్ వేసుకుని దర్శనమిచ్చింది. ఇందులో ఆమె స్టిల్స్ కనువిందు చేస్తున్నాయి. ఫలితంగా ఈ ఫొటోలకు నెటిజన్ల నుంచి అదిరిపోయే స్పందన దక్కుతోంది. అలా శాన్వీ మేఘన షేర్ చేసిన ఈ పిక్స్ అన్నీ ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి.

